# మనం

## మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల,
నారాయణ పేట, వనపర్తి



ఆదివారం । 31 । మే । 2026 పేజీలు: 15





# వారం రోజుల లోగా ధాన్యం కొనుగోలు

# పూర్తి చేయాలి

**ప్రతి గింజను కొనుగోలు చేస్తాం**

**దేశంలోనే ధాన్యం కొనుగోలు లో తెలంగాణ రాష్ట్రం నంబర్ వన్**

**తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి గోదాములకు తరలింపు**

**రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి**

2




జిల్లాకు సంబంధించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను వారం రోజుల్లో జూన్ 4,5 తేదీలోగా పూర్తి చేయాలని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు.శనివారం మహబూబ్ నగర్ జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలకు సంబంధించిన ధాన్యం కొనుగోలు అంశంపై రాష్ట్ర ఎక్సైజ్,పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు,రాష్ట్ర పశు సంవర్ధక,మత్స్య,పాడి అభివృద్ధి,క్రీడలు,యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీ హరి,రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నా రెడ్డి లతో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు.

## ఉమ్మడి పాలమూరు జిల్లాలో పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్,పెండింగ్ ప్రాజెక్టులు వేగవంతం



రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

అజిలాపురం లిఫ్ట్ ఇరిగేషన్ కు శంకుస్థాపన చేసిన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,వాకిటి శ్రీ హరి,రాష్ట ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జీ. చిన్నా రెడ్డి

3

## జులైలో పాలమూరు విశ్వవిద్యాలయంలో

# జాతీయ సదస్సు



3

సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరుకానున్న సీఎం రేవంత్ రెడ్డి

దేశవ్యాప్తంగా ఉపకులపతులు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తల సమాగమానికి( సమ్మేళనానికి ) వేదిక కానున్న పాలమూరు విశ్వవిద్యాలయం

# వారం రోజుల లోగా ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలి





- ప్రతి గింజను కొనుగోలు చేస్తాం
దేశంలోనే ధాన్యం కొనుగోలు లో తెలంగాణ రాష్ట్రం నంబర్ వన్
తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి గోదాములకు తరలింపు
రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

మహబూబ్ నగర్, 30మే,(మనం న్యూస్ ): ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు సంబంధించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను వారం రోజుల్లో జూన్ 4,5 తేదీలోగా పూర్తి చేయాలని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు.శనివారం మహబూబ్ నగర్ జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలకు సంబంధించిన ధాన్యం కొనుగోలు అంశంపై రాష్ట్ర ఎక్సైజ్,పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు,రాష్ట్ర పశు సంవర్ధక,మత్స్య,పాడి అభివృద్ధి,క్రీడలు,యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీ హరి,రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నా రెడ్డి లతో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో

రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్,డిల్లీలో

రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి జితేందర్ రెడ్డి,ప్రభుత్వ విప్,మహబూబ్ నగర్ శాసన సభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి,దేవరకద్ర శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి,జడ్చర్ల శాసన సభ్యులు జె.అనిరుధ్ రెడ్డి,నాగర్ కర్నూల్ శాసన సభ్యులు కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి,అచ్చం పేట శాసన సభ్యులు చిక్కుడు వంశీ కృష్ణ రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర,రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్, మహబూబ్ నగర్,నాగర్ కర్నూల్,నారాయణ పేట,గద్వాల,వనపర్తి

జిల్లాల కలెక్టర్లు ఖుష్బూ గుప్తా,హేమంత్ కేశవ్ పాటిల్,సి.హెచ్.ప్రియాంక, ఆదర్శ్ సురభి,రిజ్వాన్ బాషా షేక్,

,అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలకు చెందిన కలెక్టర్లు ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలపై మంత్రులకు వివరించారు.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ , రాష్ట్రంలోని పలు ఉమ్మడి జిల్లాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు జిల్లా ఇంచార్జి మంత్రులు,జిల్లా మంత్రులు,ఎమ్మెల్యేలు, తదితరులతో కలిసి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సారథ్యం లోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతుల పక్షపాత ప్రభుత్వం అని పేర్కొన్నారు.

దేశంలో ఎక్కడా లేని 29 రాష్ట్రాల్లో రైతులకు మేలు చేసింది తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం అన్నారు.దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అత్యధిక వరి ధాన్యం పండించి తెలంగాణ రాష్ట్రం దేశం లో నంబర్ వన్ రాష్ట్రంగా నిలిచిందని తెలిపారు. వరి,మొక్క జొన్న ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని తెలిపారు.రైతులు నష్ట పోకుండా తడిసిన ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేసి బాయిల్ మిల్లులకు తరలించినట్లు తెలిపారు.వాతావరణ శాఖ జూన్ 4వ తేదీ తర్వాత వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించిన నేపథ్యంలో వారం రోజుల్లోగా జూన్ 4,5 తేదీల్లోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని కలెక్టర్లకు సూచించారు. కొనుగోలు, రవాణా, నిల్వ, రైతులకు చెల్లింపుల ప్రక్రియను సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఇసుక రవాణాకు వినియోగిస్తున్న లారీలను వారం రోజులు తాత్కాలికంగా ధాన్యం రవాణాకు మళ్లించాలని సూచించారు. అవసరమైతే లారీలు, డీసీఎంలను రిక్విజిషన్ చేసి ధాన్యం తరలింపునకు వినియోగించాలని ఎస్పీలు, ఆర్టీఏ అధికారులకు సూచించారు.

హమాలీల కొరత కొన్ని చోట్ల ఉందని,పశ్చిమ బెంగాల్ ,బీహార్ రాష్ట్రం నుంచి హమాలీ లు పని చేస్తారని,హమాలీలు అదనంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ఈ

యాసంగి లో 66 లక్షల ఎకరాల్లో వరి ధాన్యం సాగు చేయగా 141 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండించారు.ఇందులో రాష్ట్రం 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం పెట్టుకుందని అన్నారు.

ఇందుకు మించి కొనుగోలు కేంద్రాలకు అదనంగా వచ్చిన ప్రతి గింజను కొనుగోలు కు ప్రభుత్వం సిద్ధంగా




ఉందని ఆయన స్పష్టం చేశారు.కేంద్ర ప్రభుత్వం ఎం.ఎస్.పి విధానం ప్రకటించి 51 లక్షల మెట్రిక్ టన్నుకు కేంద్రం ప్రభుత్వం కొనుగోలు చేయగా రాష్ట్ర ప్రభుత్వం 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు తగ్గకుండా ఎంత ధాన్యం వచ్చినా కొనుగోలు చేస్తుందని తెలిపారు. కేంద్రం ఎం.ఎస్.పి విధానం కు

రాష్ట్ర ప్రభుత్వం 16479 కోట్ల రూ.లు అదనంగా ఖర్చు పెట్టీ ధాన్యం కొనుగోలు చేసిందని తెలిపారు.

రాష్ట్రంలో 8575 కొనుగోలు కేంద్రాలు ,13 వేల వాహనాలు,రెండు లక్షల మంది సిబ్బంది,2008 రైస్ మిల్లులు భాగస్వామ్యులు అయ్యారని,20 కోట్ల 80 లక్షల గన్ని సంచులు సరఫరా చేశామని తెలిపారు.శనివారం వరకు 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు..ఈ యాసంగి కి 111500 కోట్ల రూ.లు సుమారు 8 లక్షల 75 వేల మంది రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.8575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా 2255 కొనుగోలు కేంద్రాలు లో కొనుగోలు పూర్తి చేసినట్టు తెలిపారు.దేశంలో తెలంగాణ వరి ఎక్కువ కొనుగోలు చేస్తుందని,కేంద్రం ప్రభుత్వం రాష్ట్రంలో పండిన వరి ధాన్యం లో 38 శాతం మాత్రమే కొనుగోలు చేస్తుందని అన్నారు.కేంద్రం కొనకున్న 16479 కోట్ల రూ.లు చెల్లించి రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేస్తుందని అన్నారు.కొనుగోలు చేసిన వరి ధాన్యం కు గతంలో నెలల తరబడి చెల్లింపు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం 48 నుంచి 72 గంటల్లోనే వేగంగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తుందన్నారు 2024-25 ఖరీఫ్ , రబీ కలిపి 36,148 కోట్ల రూ.లు,2025-26 ఖరీఫ్,రబీ కి కలిపి 39,359 కోట్ల రూ.లు రైతుల ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు.అతి పెద్ద రాష్ట్రం 23 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా,తమిళ నాడు 11 లక్షల మెట్రిక్ టన్నుల మాత్రమే కొనుగోలు చేయగా

జిల్లాల వారీగా గోదాములలో నిల్వ స్థలాల కేటాయింపుపై పరస్పర సమన్వయం చేసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్రను ఆదేశించారు.

కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు వెంటనే తరలించాలని, రైతులకు ఇబ్బంది కలిగించేలా తాలు, తరుగు పేరుతో కోతలు విధించే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎక్సైజ్,పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు మాట్లాడుతూ నాగర్ కర్నూల్ లో ధాన్యం సేకరణ పై ప్రజా ప్రతినిధులు,అన్ని శాఖల అధికారులతో సమీక్ష చేసినట్లు,గోదాం ల సమస్య ఉందని,ప్రైవేట్,ఫంక్షన్ హాల్ లను కూడా తీసుకుని ధాన్యం నిల్వ చేయాలని సూచించినట్లు తెలిపారు. కొనుగోలు తర్వాత రైతు,ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జి లు ట్రాక్ షీట్ కు మిల్లులు కు పొనవసరం లేదని అన్నారు.ప్రతి కొనుగోలు కేంద్రం కి ఒక అధికారిని నియమించి మానిటర్ చేయాలని అన్నారు.టార్పాలిన్ లు ఎక్కువగా కొనుగోలు చేసే అందుబాటులో ఉంచాలన్నారు.రాష్ట్ర పశు సంవర్ధక శాఖ,మత్స్య,పాడి అభివృద్ధి,క్రీడలు యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీ హరి మాట్లాడుతూ ప్రభుత్వం సాహసో పేత నిర్ణయం తో పండించిన వరి ధాన్యం కొనుగోలు చేస్తుందని అన్నారు కొందరు ప్రభుత్వం ను అభాసు పాలు చేయటానికి విమర్శలు చేస్తున్నారని,అందరూ కలిసికట్టుగా తిప్పి కొట్టాలని అన్నారు..

రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నా రెడ్డి మాట్లాడుతూ ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ లు రాజకీయ పలుకుబడి ఉన్న వారికి కాకుండా లారీలు సరఫరా చేసే కాంట్రాక్టర్ లకు అప్ప చెప్పేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.ధాన్యం సేకరణలో జిల్లా కలెక్టర్ లు,అధికారులు అభినందించారు.ప్రభుత్వ విప్,మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి,కేంద్ర ప్రభుత్వం సహకరించుకున్నా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం సేకరణ దిగ్విజయం గా పూర్తి చేసిందని అన్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో వనపర్తి జిల్లా మినహా మిగతా జిల్లాల్లో 2,3 రోజుల్లో పూర్తి అవుతుందని అన్నారు.ముఖ్యమంత్రి,పౌర సరవరాల మంత్రి,మంత్రులు,ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉంటూ అధికారులను అప్రమత్తం చేస్తూ ధాన్యం కొనుగోలు సజావుగా జరిగేలా కృషి చేశారని అన్నారు.రికార్డ్ స్థాయిలో సేకరణ జరిగిందన్నది కాదనలేని సత్యం అన్నారు.రైతులకు సకాలంలో చెల్లింపులు జరగటంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు.ఈ సందర్భంగా 5 కోట్ల 34 లక్షల చెక్కును మహిళా సంఘాలకు కమిషన్ గా చెక్కును మంత్రి అంద చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు













# ఉమ్మడి పాలమూరు జిల్లాలో పాలమూరు రంగా రెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్,పెండింగ్ ప్రాజెక్టులు వేగవంతం

**రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**అజిలాపురం లిఫ్ట్ ఇరిగేషన్ కు శంకుస్థాపన చేసిన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,వాకిటి శ్రీ హరి,రాష్ట ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జీ. చిన్నా రెడ్డి**











మహబూబ్ నగర్, 30మే (మనం న్యూస్ ): ఉప్పడి పాలమూరు జిల్లాలో పాలమూరు రంగా రెడ్డి లిఫ్ట్ బిరిగేషన్ ప్రాజెక్టు తో పాటు అన్ని పెండింగ్ ప్రాజెక్టు లు వేగవంతం చేసి చరిత్ర లో నిలిచి పోయే విధంగా

కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తుందని రాష్ట్ర నీటి పారుదల శాఖ,పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.శనివారం

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం లో దేవరకద్ర మండలం లో 32.05 కోట్ల రూపాయలతో నిర్మాణం చేయనున్న అజిలాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి రాష్ట్ర పశు సంవర్థక,మత్స్య శాఖ,పాడి అభివృద్ధి,క్రీడలు,యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీ హరి,రాష్ట ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి లతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ అజిలాపురం లిఫ్ట్ ఇరిగేషన్ పనులు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందని,ఈ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ వలన అజిలా పురం,గద్దె గూడెం, వెంకటాయ పల్లి గ్రామాలకు 1400 ఎకరాల ఆయకట్టుకు కోయిల్ సాగర్ సోర్స్ నుండి సాగు నీరు అందుతుందని తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కు ప్రాధాన్యత నిచ్చి ఉమ్మడి పాలమూరు జిల్లాలో పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు తో పాటు కల్వకుర్తి,నెట్టెంపాడు,భీమా,తదితర ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందని తెలిపారు

పాలమూరు రంగా రెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ 90 శాతం పూర్తి చేశామని చెప్పటం అబద్ధం అన్నారు ఒక్క ఎకరా ఆయకట్టుకు నీరు ఇవ్వలేదని అన్నారు.జూన్ 4,5 తేదీల్లో రాష్ట ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి తో పాటు తాను ఉమ్మడి జిల్లాలో నిర్మాణంలో ఉన్న లైఫ్ ఇరిగేషన్ పనులు,పెండింగ్ పనులు పరిశీలించి అవసరమైన నిధులు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. జూన్ 4 న జూరాల నుండి ప్రారంభించి 4,5 తేదీల్లో కల్వకుర్తి,, నెట్టెంపాడు,భీమా,నార్లాపూ,ర్,ఉద్దండా పూర్ రిజర్వాయర్ లను సి. ఎం.,తాను పర్యటించి భూ సేకరణ,పెండింగ్ పనులకు ఎన్ని వేల కోట్ల నిధులైనా మంజూరు చేసి పూర్తి చేయ నున్నట్లు తెలిపారు.

ఇరిగేషన్ ప్రాజెక్ట్ ల నిర్మాణం భూ సేకరణకు, ఆర్ఆర్, పెండింగ్ బిల్లులు నిధులు విడుదల చేసి ఇరిగేషన్ ప్రాజెక్ట్ పెండింగ్. పనులు,పాలమూరు రంగా రెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు వేగవంతం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఉమ్మడి పాలమూరు జిల్లాలో కొడంగల్ నారాయణ పేట,కల్వకుర్తి,నెట్టెంపాడు,భీమా,కోయిల్ సాగర్,పాల మూరు రంగా రెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పెండింగ్ పనులు ప్రభుత్వం వచ్చే రెండున్నర సంవత్సరం ల కాలంలో పూర్తి చేస్తామని ప్రకటించారు.స్థానిక శాసన సభ్యులు జి.మధు సూదన్ రెడ్డి కోరిన విధంగా చౌదరి పల్లి లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేస్తానని సానుకూలంగా స్పందించారు

దేవరకద్ర శాసన సభ్యులు జి.మధు సూదన్ రెడ్డి మాట్లాడుతూ కోయిల్ సాగర్ కాలువల మరమ్మతులకు 150 కోట్లు మంజూరు చేయాలని,22 వేల ఎకరాలకు అదనంగా సాగు నీరు. అందించ వచ్చని తెలిపారు. 87 కోట్ల రూ లు చౌదరి పల్లి లిఫ్ట్ ఇరిగేషన్ కు ప్రతిపాదనలు పంపాం అనుమతులు మంజూరు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి.హరిప్రియ,ఎస్.పి.డి.జానకి,సర్పంచ్ అనంతమ్మ, మాజీ జడ్.పి చైర్మన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కొనుగోలు కేంద్రం సందర్శన**

అజిలా పూర్ శివార్ లో ఏర్పాటు చేసిన పి. ఏ సి.ఎస్.కొనుగోలు కేంద్రం ను మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,వాకిటి శ్రీ హరి లు సందర్శించారు.కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు,ఎం.ఎస్.పి చెల్లింపు పై రైతులతో మాట్లాడారు..కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తూ ఎం.ఎస్.పి.రైతుల ఖాతాల్లో జమ అవుతున్నట్లు వారు సంతోషంతో మంత్రులకు వివరించారు.

# జులైలో పాలమూరు విశ్వవిద్యాలయంలో జాతీయ సదస్సు

**సదస్సు కు ముఖ్య అతిథిగా హాజరుకానున్న సీఎం రేవంత్ రెడ్డి**

**₹దేశవ్యాప్తంగా ఉపకులపతులు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తల సమాగమానికి( సమ్మేళనానికి ) వేదిక కానున్న పాలమూరు విశ్వవిద్యాలయం**



మహబూబ్ నగర్, 30మే, (మనం న్యూస్ ): జులై లో పాలమూరు యూనివర్శిటీలో రెండు రోజులపాటు జాతీయ సదస్సు నిర్వహించడం జరుగుతుందని పీయు ఉప కులపతి ప్రొఫెసర్ జి ఎన్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం పాలమూరు విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ జి.ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతు జూలై నెలలో నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక రెండు రోజుల జాతీయ సదస్సుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.ఈ సందర్భంగా జి ఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్ష అభియాన్ పథకం కింద రూ.35 లక్షల నిధుల సహకారంతో పాలమూరు విశ్వవిద్యాలయంలో రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సు దేశవ్యాప్తంగా ఉన్న ఉన్నత విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, పారిశ్రామిక రంగాల మధ్య సమన్వయం, సహకారం మరియు జ్ఞాన మార్పిడికి ఒక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు.ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్ష అభియాన్ లో కాంపోనెంట్ కింద ఎంపికైన విశ్వవిద్యాలయాల ఉపకులపతులు ఈ సదస్సుకు హాజరవుతారని తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి కేంద్ర విశ్వవిద్యాలయాలు, రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, ఉన్నత విద్యా నిపుణులు, పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు మరియు విధాన నిర్ణేతలు ఈ సదస్సులో పాల్గొననున్నారని వివరించారు. రెండు రోజుల జాతీయ మహబూబ్నగర్ ఎమ్మెల్యే మరియు మహబూబ్నగర్ మంత్రుల ద్వారా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని ఈ జాతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరు అయ్యేవిధంగా ప్రయత్నిస్తున్నామని ఉపకులపతి తెలిపారు. అదేవిధంగా కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, విద్యావేత్తలు, పరిశోధకులు మరియు పరిశ్రమల ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారని పేర్కొన్నారు.

సదస్సులో భాగంగా దేశవ్యాప్తంగా పి ఎం ఉష కింద రూ.100 కోట్ల నిధులు మంజూరైన 27 విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, ప్రతినిధులు తమ సంస్థల అభివృద్ధి కార్యక్రమాలు, పరిశోధన ప్రాజెక్టులు, విద్యా సంస్కరణలు మరియు వినూత్న కార్యక్రమాలను ప్రతిబింబించే ప్రత్యేక ప్రదర్శన స్టాల్స్ను ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. ఈ స్టాల్స్ ద్వారా వివిధ విశ్వవిద్యాలయాల ఉత్తమ విధానాలు, అనుభవాలు మరియు విజయ గాథలను పరస్పరం పంచుకునే అవకాశం లభిస్తుందని చెప్పారు.సదస్సు రెండవ రోజు రూ.20 కోట్ల నిధులు పొందిన విశ్వవిద్యాలయాల ఉపకులపతులతో ప్రత్యేక ఇంటరాక్షన్ సెషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే రూ.10 కోట్లు మరియు రూ.5 కోట్ల నిధులు పొందిన విద్యాసంస్థల ప్రతినిధులతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని విజయవంతమైన పారిశ్రామికవేత్తలతో ప్రత్యేక చర్చా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశాలు ఉన్నత విద్యా రంగంలో నూతన అవకాశాలు, పరిశోధన విస్తరణ, పరిశ్రమలతో అనుసంధానం వంటి అంశాలపై దృష్టి సారిస్తాయని తెలిపారు.

దక్షిణ భారతదేశంలో ఈ తరహా జాతీయ స్థాయి సదస్సును నిర్వహిస్తున్న మొట్టమొదటి విశ్వవిద్యాలయంగా పాలమూరు విశ్వవిద్యాలయం నిలవడం ఎంతో గర్వకారణమని ఉపకులపతి పేర్కొన్నారు. ఈ సదస్సు ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ పరిశోధనా సంస్థలు, విశ్వవిద్యాలయాలు మరియు పారిశ్రామిక సంస్థలతో విద్యా, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో సహకార సంబంధాలు బలోపేతం అవుతాయని అన్నారు.ఈ జాతీయ సదస్సులో భాగంగా వివిధ పరిశ్రమలు మరియు విద్యా సంస్థల మధ్య అవగాహన ఒప్పందాలు కుదుర్చుకునే కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. దీని ద్వారా విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ, ఇంటర్న్షిప్లు, ఉపాధి అవకాశాలు, స్టాల్స్ మరియు పరిశోధన భాగస్వామ్యాలు విస్తరించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా సదస్సు కోఆర్డినేటర్ మరియు ఓఎస్డీ టు వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, ఉపకులపతి ప్రొఫెసర్ జి.ఎన్. శ్రీనివాస్ దూరదృష్టి, ప్రణాళికాబద్ధమైన కృషి ఫలితంగానే ఈ జాతీయ స్థాయి సదస్సుకు సంబంధించిన ప్రతిపాదన ఆమోదం పొందిందని అన్నారు. దక్షిణ భారతదేశంలో మొట్టమొదటిసారిగా ఇలాంటి ప్రతిష్ఠాత్మక సదస్సును నిర్వహించే అవకాశం పాలమూరు విశ్వవిద్యాలయానికి లభించడం విశ్వవిద్యాలయ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ మీడియా సమావేశంలో ఓఎస్డీ టు వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి. మధుసూదన్ రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ కె. ప్రవీణ , పి ఆర్ ఓ డాక్టర్ యం. గాలెన్న మరియు మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- గ్రామీణాభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి...
- వరి కొనుగోలు కేంద్రాల తనిఖీ చేసిన కలెక్టర్.....
- రైతులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలి.....
- ఉపాధి హామీ పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలన....
- ఉప్పునుంతల మండలంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి....
- లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు....
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్.....







ఉమ్మడి మహబూబ్ నగర్ మే 30 (మనం బ్యూరో): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు పూర్తిస్థాయిలో చేరేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సూచించారు. శనివారం ఉదయం అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని ఉప్పునుంతల మండలంలోని మామిళ్ళపల్లి, లక్ష్మాపూర్ గ్రామాలను కలెక్టర్ సందర్శించారు. ముందుగా మామిళ్ళపల్లి గ్రామంలోని చెరువు కట్టపై కొనసాగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించి, పనుల నాణ్యత, కార్మికుల హాజరు, వేతనాల చెల్లింపులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశగా పనులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్, లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి నిర్మాణాల పురోగతి, ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలను నిర్ణీత గడువులో పూర్తి చేసి అర్హులైన కుటుంబాలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండరాదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో కొనసాగుతున్న జనాభా గణన ప్రక్రియను కూడా కలెక్టర్ పరిశీలించారు. ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ ప్రణాళికల రూపకల్పనలో జనాభా గణాంకాలు కీలకమని సిబ్బందికి సూచించారు. జూన్ 1వ. తేదీ నాటికి జిల్లాలో మొదటి విడత జనగణన ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

తదనంతరం మామిళ్ళపల్లి, లక్ష్మాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ రైతులతో మాట్లాడి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, తూకం, చెల్లింపుల విధానంపై వివరాలు పూర్తి స్థాయిలో తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించడంతో పాటు రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. వరి కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు, నిల్వ ఏర్పాట్లు, రికార్డుల నిర్వహణను పరిశీలించిన కలెక్టర్, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రైతులు తమ పంటకు గిట్టుబాటు ధర పొందేలా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే ఎంపిక చేసిన మిల్లులకు తరలించేందుకు అవసరమైన లారీలను అందుబాటులో ఉంచాలని సూచించారు. అంతకుముందు మామిళ్ళపల్లి గ్రామంలోని పురాతన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని సందర్శించిన కలెక్టర్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టత, చారిత్రక ప్రాధాన్యతపై ఆలయ అర్చకులను అడిగి తెలుసుకున్నారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పన తదితర అంశాలపై ఆరా తీశారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచ్లు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సౌకర్యార్థం ఉండే విధంగా నిర్మాణాలు పూర్తి చేయండి

- విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట....
- గ్రామీణ విద్యార్థులకు ఆధునిక విద్యా వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం.....
- పాఠశాలల పునఃప్రారంభం నాటికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి.....
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్....



ఉమ్మడి మహబూబ్ నగర్ మే 30 (మనం బ్యూరో): విద్యార్థులకు విద్యార్థులకు సౌకర్యార్థంగా ఉండేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టి పాఠశాలలు పునః ప్రారంభం నాటికి పూర్తి చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని వంగూరు మండలంలోని పోల్కంపల్లి, వంగూరు గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవనాల పనులను శనివారం కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల భవన నిర్మాణం, తరగతి గదులు, లైబ్రరీ, ఆటస్థలాలు, తాగునీటి సదుపాయాలు, పారిశుద్ధ్య వసతులతో పాటు తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటును కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. నిర్మాణ పనుల పురోగతిని ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నిర్మిస్తున్న ఈ విద్యాసంస్థల్లో ప్రతి నిర్మాణం నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్మాణ సామగ్రి నాణ్యత, భవనాల భద్రతా ప్రమాణాలు, విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా తరగతి గదుల రూపకల్పన వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా అన్ని వసతులు కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా అత్యాధునిక విద్యా వాతావరణంలో విద్యను అభ్యసించే అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చిస్తోందన్నారు.

పాఠశాలల పునఃప్రారంభ సమయానికి నిర్మాణ పనులు పూర్తికాకపోతే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. పెండింగ్ లో ఉన్న పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల ప్రారంభం నాటికి అన్ని తరగతి గదులు, లైబ్రరీ, ఆటస్థలాలు, తాగునీటి సదుపాయాలు, పారిశుద్ధ్య వసతులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణ పనుల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన విద్యా వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం నిర్మాణ ప్రదేశంలో పనిచేస్తున్న అధికారులతో సమావేశమై పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్ అన్నారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి పాఠశాలలను విద్యార్థుల వినియోగానికి సిద్ధం చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. రమేష్ కుమార్, కల్వకుర్తి ఆర్డీవో జనార్ధన్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులతో పాటు తదితరులు పాల్గొన్నారు.



# కుల,మతాలకు అతీతంగా అందరూ కలిసి ఉండాలి

- ఆర్ఐ భరత్ గౌడ్

చారకొండ,మే30(మనం న్యూస్): సమాజంలో ప్రతి ఒక్కరూ కుల,మతాలకు అతీతంగా కలిసి ఉండాలని ఆర్ ఐ భరత్ అన్నారు.పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం మర్రిపల్లి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆర్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒకరు కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి ఉండాలని,గ్రామాలలో మూడో విశ్వాసాలకు మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని, గ్రామాలలో ప్రతి ఒక్క పండుగను ఐక్యతతో మంచి వాతావరణంలో జరుపుకోవాలని దేవాలయాలలో ప్రతి ఒక్కరూ కలిసి ప్రవేశాలు చేయాలని గ్రామ ప్రజలకు సూచించారు.కార్యక్రమంలో సర్పంచ్ బిట్ల తేజశ్రీ సుధాకర్ రెడ్డి,జీపీవో వందనమ్మ,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంకల్పంతో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు

**- శాఖల సమన్వయంతో ప్రభుత్వ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి.....**

**- అభివృద్ధి పనులపై నిరంతర పర్యవేక్షణ ఎంతో అవసరం....**

**- సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశం....**

**- వివిధ శాఖల పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష సమావేశం.....**

**- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్......**





ఉమ్మడి మహబూబ్ నగర్ మే 30 (మనం బ్యూరో): ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడంలో ప్రభుత్వం ముందుకు వెళ్తున్నాను నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. శనివారం

అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను జూన్ నెలాఖరులోపు పూర్తి చేయాలని  కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల స్థితిగతులను శాఖల వారీగా సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాల భవనాల నిర్మాణం, అంగన్వాడీ కేంద్రాల భవనాలు, ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న రహదారి అభివృద్ధి పనులు, డ్రైనేజీ నిర్మాణాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం, తాగునీటి సౌకర్యాల కల్పన, విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధి తదితర కార్యక్రమాల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొండారెడ్డిపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ఎటువంటి జాప్యం చోటుచేసుకోకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్మాణ పనులన్నీ నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా పర్యవేక్షించాలని తెలిపారు. నాసిరకం పనులకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావివ్వవద్దని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ఆ దిశగా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అభివృద్ధి పనులకు సంబంధించి ఎదురవుతున్న సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలన్నారు. శాఖల మధ్య సమన్వయం లోపించకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. గడువులోపు పూర్తి కాని పనులపై సంబంధిత అధికారుల బాధ్యతను నిర్ధారిస్తామని, గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కొండారెడ్డిపల్లిని అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు, కేవీ నరసింహారెడ్డి, అదనపు కలెక్టర్ దేవ సహాయం, కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, ఐసిడిఎస్ పిడి రాజేశ్వరి ,వివిధ జిల్లా , నియోజకవర్గం, మండల స్థాయి శాఖల అధికారులు, ఇంజినీరింగ్ విభాగాల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

# బాలికలలో నాయకత్వ లక్షణాలు ఎంతో అవసరం

**- స్థానిక సమస్యల పరిష్కారానికి నాయకత్వంగా బాలికలు వ్యవహరించాలి....**

**- కిశోర బాలికలకు సైకిళ్లు పంపిణీ చేస్తాం....**

**- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్....**




ఉమ్మడి మహబూబ్ నగర్ మే 30 (మనం బ్యూరో): నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్లో ఘనంగా మహిళా వారోత్సవాల ముగింపు అనంతరం స్నేహ కిషోర బాలికలు నిర్వహించిన మాక్ పార్లమెంట్ ఎంతగానో ఆకట్టుకుందని కలెక్టర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మే 25 నుండి 30వ. తేదీ వరకు నిర్వహించిన మహిళా వారోత్సవాలు శనివారం నాటికి ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్నేహ కిషోర బాలికల సంఘాల ప్రతినిధుల మాక్ పార్లమెంట్, అవగాహన సదస్సు  కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ముగింపు కార్యక్రమానికి నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థినుల ప్రతిభను ప్రశంసిస్తూ, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన డి ఆర్ డి ఏ అధికారులకు అభినందనలు తెలిపారు.



ప్రజావాణి సమావేశ మందిరం అంతా విద్యార్థినుల ఉత్సాహభరిత ప్రసంగాలు, చర్చలతో పార్లమెంటరీ ప్రజాస్వామ్య వాతావరణాన్ని తలపించిందన్నారు. ఈ మాక్ పార్లమెంట్ ప్రత్యేక ఆకర్షణగా బాలికలు వివిధ రాజ్యాంగ పదవులను స్వయంగా నిర్వహించడం విజయవంతంగా నిలిచింది. రాష్ట్రపతిగా జ్ఞానేశ్వరి బాధ్యతలు స్వీకరించగా, లోక్సభ స్పీకర్గా యమున సభను సమర్థవంతంగా నిర్వహించారు. ప్రధానమంత్రిగా నందిని ప్రభుత్వ పక్ష చర్చలను ముందుండి నడిపించగా, లోక్సభ ప్రతిపక్ష నాయకురాలిగా నిఖిత ప్రభుత్వ విధానాలపై సూటిగా ప్రశ్నలు సంధించారు. డిప్యూటీ స్పీకర్గా ప్రియాంక సభా నియమాలను పాటింపజేస్తూ చర్చలను సమన్వయం చేశారు.

అలాగే వివిధ శాఖల మంత్రుల పాత్రల్లో ఇతర స్నేహ కిషోర బాలికలు పాల్గొని, హోమ్, ఆరోగ్యం, విద్య, గ్రామీణ అభివృద్ధి, మహిళా భద్రత, బాల్య వివాహాల నివారణ, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలపై చర్చలు నిర్వహించారు. ప్రతి అంశంపై విద్యార్థినులు తమ అభిప్రాయాలను స్పష్టంగా, ధైర్యంగా వ్యక్తం చేయడం విశేషంగా నిలిచింది. సభలో ప్రశ్నోత్తరాల సెషన్లో కూడా వారు చురుకుగా పాల్గొని సమస్యలకు పరిష్కార సూచనలు ప్రతిపాదించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ మాట్లాడుతూ...., మహిళా వారోత్సవాల ప్రధాన లక్ష్యం బాలికల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, వారికి స్వీయ అవగాహన కల్పించడమని తెలిపారు.

బాలికలు చిన్న వయస్సులోనే ప్రజాస్వామ్య వ్యవస్థ పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకోవడం భవిష్యత్ నాయకత్వానికి బలమైన పునాది అవుతుందని కలెక్టర్ తెలిపారు. బాలికలు వాక్చాతుర్యంతో నిర్భయంగా మాట్లాడడం ఒక వేదిక అవసరమన్నారు. ఇలాంటి వేదికల ద్వారా బాలికల సృజనాత్మకత సమయస్ఫూర్తి మంచి నాయకత్వ లక్షణాలు వాక్చాతుర్యం వంటి ప్రతిభ లు వస్తుంటాయని కలెక్టర్ తెలిపారు. స్నేహ కిషోర బాలికల సంఘాల ద్వారా విద్యార్థినులు సామాజిక సమస్యలను గుర్తించి వాటిపై చర్చించడం, నిర్ణయాత్మక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ఎంతో అభినందనీయమని కలెక్టర్ అన్నారు. మాక్ పార్లమెంట్ వంటి వేదికలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే కాకుండా ప్రజాస్వామ్య విలువలపై అవగాహనను పెంపొందిస్తాయని  జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. వాటిని ప్రతి ఒక్కరు తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. బాలికలు విద్యలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటిని సాధించేందుకు క్రమశిక్షణతో కృషి చేయాలని ఆయన సూచించారు. కుటుంబం, సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ గుర్తు చేశారు.

కొంతమంది బాలికలు దూరప్రాంతాలకు బస్సులు లేకపోవడం చదువుకు దూరం అవుతున్నామని తెలపడంతో అందుకు కలెక్టర్ స్పందించి

కిషోర బాలికలకు సైకిల్ లను అందజేయనున్నట్లు కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అమరేందర్, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు, అదనపు పీడీ రాజేశ్వరి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఉమాపతి, వివిధ శాఖల అధికారులు, మహిళా సంఘాల నాయకులు, మహిళలు, విద్యార్థినిలు, తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలకు చెక్ చెప్పాలి

**రక్తహీనతపై అవగాహన పెంచుకోవాలి**
**కలెక్టర్ ఆదర్శ్ సురభి**
**పోక్సో చట్టంపై పూర్తి అవగాహన అవసరం**
**ఎస్పీ సునీతా రెడ్డి**





వనపర్తి, మే 30 (మనం న్యూస్ ): అమ్మాయిలు బాల్య వివాహాలను వ్యతిరేకిస్తూ, సమాజంలోని అన్ని అంశాలపై సమగ్ర అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. బాలికలు రక్తహీనత సమస్యపై అప్రమత్తంగా ఉండి, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్నేహ (కిషోర బాలికల సంఘాలు) మాక్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీత రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

**ఉత్సాహంగా మాక్ పార్లమెంట్**

కార్యక్రమంలో బాలికలు ప్రధానమంత్రి, స్పీకర్, ఎంపీల పాత్రలు పోషిస్తూ పార్లమెంట్ సమావేశాన్ని నిర్వహించారు. మహిళా సంక్షేమం, ఆరోగ్యం, అభివృద్ధి, వరి కొనుగోళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పలు అంశాలపై చర్చించి ప్రశ్నలు సంధించారు.

**60 బాల్య వివాహాలు అడ్డుకున్నాం**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కిషోర బాలికల కోసం ప్రత్యేక సంఘాలు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. సమాజంలో ఐక్యత ఎంతో ముఖ్యమని, మాక్ పార్లమెంట్ ద్వారా బాలికల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని చెప్పారు. జిల్లాలో గత మూడేళ్లలో 60 బాల్య వివాహాలను అడ్డుకున్నామని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాల సమాచారం తెలిసిన వెంటనే 1098 హెల్ప్‌లైన్కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఉన్నత విద్య పూర్తిచేసిన తర్వాతే వివాహం చేసుకోవాలని సూచించారు.

రక్తహీనత సమస్యపై అవగాహన కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాల ద్వారా స్ఫూర్తి పొంది పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు.

**చదువే బాలికలకు రక్షణ కవచం**

జిల్లా ఎస్పీ సునీత రెడ్డి మాట్లాడుతూ బాలికలు మధ్యలో చదువులు మానేయకుండా ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. విద్యనే అత్యంత ప్రాధాన్యతగా భావించి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో బాలికలు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నారని, వాటిని అవగాహనతో అధిగమించాలని సూచించారు. యాంటీ సోషల్ ఎలిమెంట్స్ వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరికీ పోక్సో చట్టంపై అవగాహన ఉండాలని తెలిపారు. ప్రతి విషయాన్ని ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, అవసరమైన సందర్భాల్లో ధైర్యంగా 'నో' చెప్పగలగాలని సూచించారు.

**చెక్కుల పంపిణీ.. పోస్టర్ల ఆవిష్కరణ**

ఈ సందర్భంగా మహిళా సంఘాలకు వరి ధాన్యం కొనుగోళ్ల కమిషన్ చెక్కులు, ఎఫ్పీఓ సంఘాలకు సంబంధించిన చెక్కులను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. బాలికల సంరక్షణకు సంబంధించిన వాల్ పోస్టర్లను కూడా ఆవిష్కరించారు.

కార్యక్రమంలో డీఆర్డీఓ ఉమాదేవి, డీఎస్పీ బాలాజీ నాయక్, డీసీవో రాణి, డీఐవో జ్యోతి, డీడబ్ల్యూవో సుధారాణి, డీఎంహెచ్వో సాయినాథ్ రెడ్డి, డీఐఈవో నరేంద్ర, కేజీబీవీ అధికారులు, మహిళా సమాఖ్య ప్రతినిధులు, విద్యార్థినులు, స్నేహ సంఘాల సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రజల్లోకి మరింతగా వెళ్లాలి

**- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ**



అచ్చంపేట, మే 30 (మనం న్యూస్): అచ్చంపేట పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రచారం, ప్రజా సమస్యల పరిష్కారం, రానున్న పార్టీ కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతి వర్గానికి న్యాయం చేసే విధంగా పథకాలను అమలు చేస్తోందన్నారు.

ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామాలు, వార్డులు, కాలనీల స్థాయిలో ప్రజలను కలుస్తూ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

ప్రజా ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ఇంటింటికీ తీసుకెళ్లడంతో పాటు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రజలకు మరియు ప్రభుత్వానికి మధ్య వారధిగా కాంగ్రెస్ కార్యకర్తలు పనిచేయాలని ఎమ్మెల్యే అన్నారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తలే వెన్నెముక అని పేర్కొన్న ఎమ్మెల్యే, పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేస్తున్న ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని మరింతగా పొందేందుకు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

అదేవిధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ప్రజలకు వివరించే విధంగా కార్యకర్తలు తమను తాము తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు సాగాలని అన్నారు.



ఈ సమావేశంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశం అనంతరం పార్టీ బలోపేతం కోసం సమిష్టిగా పనిచేయాలని నాయకులు, కార్యకర్తలు నిర్ణయించారు.

# జల సంచాయ్ పనుల ఫొటోలు వెంటనే అప్లోడ్ చేయాలి

**నేటి సాయంత్రం వరకు మాత్రమే గడువు**
**కలెక్టర్ ఆదర్శ్ సురభి**
**ఫ్యామిలీ బెనిఫిట్, ఉపాధి హామీ పనులపై సమీక్ష**



వనపర్తి, మే 30 మనం న్యూస్ : జల సంచాయ్ జన్ భాగేదారి (జేఎస్జేబీ) కార్యక్రమం కింద జిల్లాలో ఇప్పటి వరకు చేపట్టి పూర్తి చేసిన పనుల ఫొటోలను యుద్ధప్రాతిపదికన ఆన్లైన్ పోర్టల్లో అప్లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు.

శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న జేఎస్జేబీ, జాతీయ ఫ్యామిలీ బెనిఫిట్ పథకం, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై సమీక్ష నిర్వహించారు.

జల సంచాయ్ జన్ భాగేదారి కార్యక్రమంపై సమీక్ష సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పడే ప్రతి వర్షపు నీటి బొట్టును భూమిలో ఇంకించి భూగర్భ జలాలను పెంపొందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1.14 లక్షల పనులు పూర్తి చేశామని, వాటన్నింటికీ సంబంధించిన ఫొటోలను తప్పనిసరిగా ఆన్లైన్లో అప్లోడ్ చేయాల్సి ఉందన్నారు. ఇందుకు నేటి సాయంత్రం వరకు మాత్రమే గడువు ఉన్నందున అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

పెండింగ్ దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి

జాతీయ ఫ్యామిలీ బెనిఫిట్ పథకంపై సమీక్షిస్తూ పేద కుటుంబ యజమాని మరణించినప్పుడు కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయం అందించే ఈ పథకం ప్రయోజనాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేయాలని కలెక్టర్ ఆదేశించారు. 2017 నుంచి మరణించిన కుటుంబ యజమానుల వివరాలను సేకరించి, బాధిత కుటుంబాలతో దరఖాస్తులు చేయించాలని ఎంపీడీఓలను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు ఈ బాధ్యతను స్వీకరించి దరఖాస్తులను సేకరించి ఆమోదానికి పంపించాలని సూచించారు. ఇప్పటి వరకు జిల్లాలో 265 దరఖాస్తులు మాత్రమే అందగా, వాటిలో 205 దరఖాస్తులు ఎంపీడీఓ లాగిన్లో పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. వీటిని వెంటనే పరిష్కరించాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉపాధి హామీ పనులకు ప్రాధాన్యం

జాతీయ ఉపాధి హామీ పథకంపై సమీక్ష సందర్భంగా జిల్లాలో 1,00,602 యాక్టివ్ జాబ్ కార్డులు ఉన్నాయని, ప్రతిరోజూ కనీసం 40 శాతం మంది కూలీలకు పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి గ్రామపంచాయతీలో వ్యక్తిగత, సామూహిక ఇంకుడు గుంతలతో పాటు అన్ని ప్రభుత్వ భవనాల వద్ద ఇంకుడు గుంతలు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని సూచించారు. అలాగే రానున్న వనమహోత్సవ కార్యక్రమాలకు సకాలంలో మొక్కలు నాటేందుకు ముందస్తుగా గుంతలు తవ్వి సిద్ధం చేయాలని ఆదేశించారు.

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అంకితభావంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని, పనితీరులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

సమావేశంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఎన్. ఖీమ్యా నాయక్, జడ్పీ సీఈఓ యాదయ్య, డీఆర్డీఓ పీడీ ఉమాదేవి తదితర అధికారులు పాల్గొన్నారు.

# 37 ఏళ్ల సేవలకు ఘన సత్కారం

## ఎస్ఐ సుబ్బరాజుకు ఎస్పీ సునీతారెడ్డి వీడ్కోలు



వనపర్తి, మే 30 (మనం న్యూస్ ): పోలీసు శాఖలో 37 ఏళ్లపాటు నిష్కళంకంగా సేవలందించి పదవీ విరమణ పొందిన జిల్లా పోలీసు కార్యాలయం కంట్రోల్‌రూమ్ ఎస్సై సుబ్బరాజు కు జిల్లా ఎస్పీ సునీతారెడ్డి ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో సుబ్బరాజుతో పాటు ఆయన సతీమణిని పూలమాలలు, శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

### కానిస్టేబుల్గా మొదలై ఎస్ఐగా ఎదుగుదల

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, 1989లో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా పోలీసు శాఖలో కానిస్టేబుల్గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన సుబ్బరాజు కృషి, పట్టుదల, క్రమశిక్షణతో అంచెలంచెలుగా ఎదిగి సబ్‌ఇన్స్పెక్టర్ హోదా సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆయన సేవా ప్రస్థానం యువ పోలీసు సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు.

₹నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లోనూ విశేష సేవలు₹

మహబూబ్నగర్, నాగర్కర్నూల్, గద్వాల్, వనపర్తి ప్రాంతాల్లో వివిధ హోదాల్లో పనిచేసిన సుబ్బరాజు, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లోనూ ధైర్యసాహసాలతో విధులు నిర్వహించారని ఎస్పీ కొనియాడారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ శాఖకు మంచి పేరు తీసుకువచ్చారని తెలిపారు.

### నిష్కళంక సేవలకు ప్రశంసలు

37 ఏళ్ల సర్వీసు కాలంలో ఎటువంటి ప్రతికూల వ్యాఖ్యలు లేకుండా విధులు నిర్వర్తించడం ఆయన నిబద్ధతకు నిదర్శనమని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజల పట్ల మానవీయ దృక్పథం, విధి నిర్వహణలో అంకితభావం, సహోద్యోగులతో స్నేహపూర్వక వైఖరి ఆయన ప్రత్యేకతలని చెప్పారు. సుబ్బరాజు సేవలు యువతరం పోలీసులకు మార్గదర్శకంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు.

### పదవీ విరమణ ఉద్యోగానికే.. సేవాభావానికి కాదు

పదవీ విరమణ ప్రతి ఉద్యోగి జీవితంలో కొత్త అధ్యాయమని, ఇకపై కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సుబ్బరాజుకు సూచించారు. ప్రభుత్వం అందించే జీపీఎఫ్, బీమా తదితర పదవీ విరమణ ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ఆయనకు అందాల్సిన అన్ని ఆర్థిక ప్రయోజనాలు, బకాయిలను త్వరితగతిన చెల్లించేలా సంబంధిత అధికారులను ఆదేశించారు.

### పలువురు అధికారుల హాజరు

కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా, డీఎస్పీలు గిరిబాబు, బాలాజీనాయక్, సీఐలు సుగంధరత్నం, రాంబాబు, శివకుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ అప్పలనాయుడు, పోలీసు సిబ్బంది, సుబ్బరాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

---

# ప్రజాభద్రతలో రాజీ లేదు..

**బాధ్యతాయుతంగా పనిచేయాలి**

**నేరాల నియంత్రణ, సైబర్ మోసాల అరికట్టడంపై ప్రత్యేక దృష్టి**

**రాత్రివేళ అనవసర సంచారంపై కట్టడి చేయాలని ఆదేశాలు**

**నెలవారీ నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ సునితా రెడ్డి**



వనపర్తి, మే 30 (మనం న్యూస్ ): ప్రజల విశ్వాసమే పోలీసు శాఖకు అతిపెద్ద బలమని, ప్రజాభద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని జిల్లా ఎస్పీ సునితా రెడ్డి స్పష్టం చేశారు.

ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజలకు చేరువ కావాలని సూచించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

పెండింగ్లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, ముఖ్యంగా గ్రేవ్, నాన్-గ్రేవ్ కేసులకు సంబంధించిన ఎఫ్ఎస్ఎల్ నివేదికలు, వైద్య ధ్రువపత్రాలు త్వరితగతిన సేకరించి కేసులను పూర్తి చేయాలని ఎస్పీ ఆదేశించారు. కేసుల దర్యాప్తులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు.

గ్రామ స్థాయిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి ఎస్సై తమ పరిధిలోని గ్రామాలను తరచూ సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని పేర్కొన్నారు. రౌడీషీటర్లు, అనుమానితుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. బ్లూకోల్ట్స్, నైట్ పెట్రోలింగ్ సిబ్బంది ఫింగర్‌ప్రింట్ పరికరాల వినియోగాన్ని పెంచి అనుమానితుల వివరాలు సేకరించాలని సూచించారు.

సైబర్ నేరాలపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలని, డిజిటల్ అరెస్టులు, పోలీసుల పేరుతో వచ్చే మోసపూరిత కాల్స్, గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే వీడియో కాల్స్ను నమ్మవద్దని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. మోసాలకు గురైన వెంటనే తొలి గంటలోపే ఫిర్యాదు చేసేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

సమాజ భద్రతలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని పేర్కొన్న ఎస్పీ, గ్రామాలు, వీధులు, పరిశ్రమలు, ప్రార్థనా స్థలాల్లో కమ్యూనిటీ సీసీ కెమెరాల ఏర్పాటు కోసం చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇంటి వద్ద ఏర్పాటు చేసిన కెమెరాల్లో వీధివైపు ఉన్న వాటిని జియో ట్యాగింగ్ చేయించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు.

జిల్లాలో అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, ఓపెన్ డ్రింకింగ్, జూదం, గేమింగ్, మట్కా వంటి కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో అనవసరంగా రోడ్లపై తిరిగేవారిని తనిఖీ చేస్తూ దొంగతనాల నివారణకు గస్తీని మరింత పటిష్ఠం చేయాలని సూచించారు.

పోలీస్ స్టేషన్లలోని రికార్డులను ప్రతిరోజూ నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా నిర్వహించాలని, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని ఎస్పీ స్పష్టం చేశారు.



సమావేశంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా, డీఎస్పీలు గిరిబాబు, బాలాజీ నాయక్, సీఐలు సుగంధరత్నం, రాంబాబు, శివకుమార్, నరేష్తో పాటు డీసీఆర్బీ, ఐటీ కోర్, కమ్యూనికేషన్, ఫింగర్‌ప్రింట్స్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

---

# మధుర నగర్లో వర్షపు నీటి సమస్యను పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



అచ్చంపేట, మే 30 (మనం న్యూస్): అచ్చంపేట పట్టణంలోని మధుర నగర్ 9వ వార్డులో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నెలకొన్న వర్షపు నీటి నిల్వ సమస్యను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ శనివారం ప్రత్యక్షంగా పరిశీలించారు. కాలనీలోని పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా గమనించి పరిస్థితిపై ఆరా తీశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలనీవాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల ముందు, రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడం వల్ల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దోమల వ్యాప్తి పెరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అలాగే డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య పునరావృతమవుతోందని నివేదించారు.

ప్రజల నుంచి సమస్యలను విన్న ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిస్థితిని వివరించారు. నీటి నిల్వ సమస్యను అత్యవసరంగా పరిష్కరించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో అవసరమైన చోట డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు నీరు నిల్వ కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ, ‘ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత. వర్షాల కారణంగా మధుర నగర్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సీరియస్గా తీసుకుంది. తాత్కాలిక చర్యలతో పాటు శాశ్వత పరిష్కారం కోసం కూడా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుంటాం‘ అని తెలిపారు. కాలనీలో వర్షపు నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు అధికార యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తుందని పేర్కొన్నారు. ఈ పర్యటనలో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే స్వయంగా కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



# శివసాయి నగర్లో మార్నింగ్ వాక్ నిర్వహించిన ఎమ్మెల్యే

**– ప్రజల సమస్యలను తెలుసుకొని అధికారులకు తక్షణ ఆదేశాలు**





అచ్చంపేట, మే 30 (మనం న్యూస్): నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలకు మరింత చేరువవుతున్నారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం అచ్చంపేట పట్టణంలోని శివసాయి నగర్ కాలనీలో నిర్వహించిన మార్నింగ్ వాక్ కార్యక్రమంలో పాల్గొని కాలనీవాసులతో ముఖాముఖి సమావేశమయ్యారు.

కాలనీలోని వీధుల వెంట నడుచుకుంటూ వెళ్లిన ఎమ్మెల్యే స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ ప్రాంతంలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా తాగునీటి సరఫరాలో అంతరాయం, డ్రైనేజీ వ్యవస్థలో లోపాలు, పారిశుద్ధ్య సమస్యలు, అంతర్గత రోడ్ల మరమ్మతులు, వీధి దీపాల కొరత వంటి అంశాలను ప్రజలు ప్రస్తావించారు.

ప్రజల సమస్యలను ఓపికగా విన్న ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాలనీలో అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపర్చేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 'ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి క్షేత్రస్థాయిలో పర్యటించడం చాలా అవసరం. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోంది. కాలనీల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం' అని తెలిపారు. అలాగే పట్టణ అభివృద్ధిలో ప్రజల సహకారం కూడా అవసరమని, పరిశుభ్రత పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించడం ద్వారా ప్రజలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

మార్నింగ్ వాక్ సందర్భంగా ప్రజలు ఎమ్మెల్యేతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను వివరించేందుకు అవకాశం లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రజల మధ్యకు వచ్చి సమస్యలను తెలుసుకోవడం అభినందనీయమని కాలనీవాసులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, మాజీ కౌన్సిలర్ సునీత శ్రీనివాస్ రెడ్డి, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖాదర్, నాయకులు గోపాల్ రెడ్డి, రామనాథం, రాములు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కాలనీవాసులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ చేపడుతున్న క్షేత్రస్థాయి పర్యటనలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# ధాన్యం కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం

**బీజేపీ ఆరోపణ రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు పడుతున్నారని విమర్శ**



వనపర్తి, మే 30 (మనం న్యూస్ ): తెలంగాణ రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు విమర్శించారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం నోడల్ ఏజెన్సీగా వ్యవహరించి సింగిల్ విండో, ఐకేపీ, మెప్మా ద్వారా సమన్వయం చేస్తూ కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాల్సి ఉండగా పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

**గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు లేక రైతులకు కష్టాలు**

ధాన్యం సేకరణకు అవసరమైన గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, రవాణా సౌకర్యాలు సరైన సమయానికి అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నెలల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం నిల్వ ఉండటంతో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల ధాన్యం తూకం వేయడం, మిల్లులకు తరలించడం వంటి ప్రక్రియలు తీవ్రంగా ఆలస్యమవుతున్నాయని విమర్శించారు.

**అకాల వర్షాలతో తడిసిన ధాన్యం – రైతులకు నష్టం**

రవాణా ఆలస్యం కారణంగా ధాన్యం కేంద్రాల్లోనే నిల్వ ఉండిపోవడంతో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పెద్దఎత్తున ధాన్యం తడిసిపోయిందని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ప్రభుత్వంపై రాజకీయ ఆరోపణలు

మంత్రులు, ముఖ్యమంత్రి 80 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని చెబుతున్నారని, కానీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని బీజేపీ నేతలు ఆరోపించారు. ప్రతిపక్షాలపై రాజకీయాలు చేస్తున్నాయి అని వ్యాఖ్యానించడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు.

**రైతు గోసా-బీజేపీ భరోసా కార్యక్రమం**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు ఆధ్వర్యంలో రైతు గోసా-బీజేపీ భరోసా కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రైతుల సమస్యలను పరిశీలిస్తున్నామని తెలిపారు. రైతుల సమస్యలు పరిష్కరించకపోతే జిల్లా కలెక్టరేట్లను ముట్టడిస్తామని హెచ్చరించారు.

## మూడు నెలలుగా నిలిచిపోయిన మిషన్ భగీరథ పనులు..

# ప్రజల ప్రాణాలతో చెలగాటమా?

**అభివృద్ధి పనులు అస్తవ్యస్తం.. అధికారులు, కాంట్రాక్టర్ల మధ్య సమన్వయ లోపంతో ప్రజలు ఇబ్బందులో...**

మహబూబ్ నగర్ ,మే30(మనం ప్రతినిధి)జడ్చర్ల పట్టణంలోని కావేరి మ్మపేట వెళ్లే ప్రధాన రహ దారిలో వర్షపు నీరు వెళ్లడానికి కాలువలు బ్రిడ్జివర్క్ మూడు నెలల నుంచి పనులు మధ్యలో నిలిచి పోయాయి పనులు ఎందుకు ఆగాయని తెలుసుకుంటే మూడు నెలలుగా మిషన్ భగీరథ పైపులైన్ పనులు నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్రఇబ్బందులుఎదుర్కొంటున్నారు. వర్షపు నీరు సక్రమంగా వెళ్లేందుకు కాలువల నిర్మాణం, మరమ్మతు పనులు కొనసాగుతున్నప్పటికీ మిషన్ భగీరథ వాటర్ పైపుల ఏర్పాటు విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు.

రోడ్లు తవ్వి వదిలేయడం, పైపుల పనులను మధ్యలోనే నిలిపివేయడం వల్ల ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా పరిస్థితి మారిందని విమర్శిస్తున్నారు. పనులు పూర్తి కాకపోవడంతో రోడ్లపై ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే పలువురు మహిళలు స్కూటీలపై ప్రయాణిస్తూ అదుపుతప్పి కిందపడిన ఘటనలు జరిగినప్పటికీ అధికారులు స్పందించకపోవడం పట్ల స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.అధికారుల నిర్లక్ష్యమే కారణమా?స్థానికుల కథనం ప్రకారం, మిషన్ భగీరథ పైపులు వేయకపోవడం వల్ల కాలువల పనులు కూడా పూర్తిస్థాయిలో ముందుకు సాగడం లేదు. ఒక శాఖ పని మరొక శాఖ పనిపై ఆధారపడినా, సంబంధిత అధికారులు మాత్రం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.'పైపులు కూడా మేమే తెచ్చాం.. అయినా పనులు చేయడం లేదు' - కాంట్రాక్టర్ఈ విషయమై కాంట్రాక్టర్ను వివరణ కోరగా, ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.సుమారు రూ.5 లక్షల వ్యయంతో మిషన్ భగీరథ పైపులను మేమే కొనుగోలు చేసి తెప్పించాం. వాస్తవానికి పైపుల బాధ్యత అధికారులదే. అయినప్పటికీ పనులు త్వరగా పూర్తవుతాయని భావించి మేమే ముందుకొచ్చాం. కానీ సంబంధిత అధికారులు పైపులైన్ పనులు చేపట్టకపోవడంతో మొత్తం ప్రాజెక్టు నిలిచిపోయింది. వారు పైపులు వేస్తే కేవలం రెండు వారాల్లో మిగతా పనులన్నీ పూర్తి చేస్తాం' అని తెలిపారు.

ప్రజల ప్రశ్నలకు సమాధానం ఎవరు?ఒకవైపు వర్షాకాలం ప్రారంభమవుతుండగా, మరోవైపు తవ్విన రోడ్లు, అసంపూర్తి పనులు ప్రజలకు ప్రమాదంగా మారుతున్నాయి. ప్రజల భద్రత కంటే శాఖల మధ్య సమన్వయ లోపమే పెద్ద సమస్యగా కనిపిస్తోందని పట్టణవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నా స్పందించని మిషన్ భగీరథ అధికారులు ఇకనైనా మేల్కొంటారా? లేక మరింత పెద్ద ప్రమాదం జరిగే వరకు నిర్లక్ష్యమే కొనసాగుతుందా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



# సింగారం సమీపంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ

**వేల లీటర్ల తాగునీరు వృథా –**
**కలుషిత నీటి సరఫరాపై ప్రజల ఆందోళన**

అచ్చంపేట, మే 30 (మనం న్యూస్): అచ్చంపేట మండలంలోని సింగారం గ్రామ సమీపంలో మిషన్ భగీరథ ప్రధాన పైప్లైన్ లీకేజీ కారణంగా వేల లీటర్ల శుద్ధి చేసిన తాగునీరు వృథాగా పోతుండటంతో స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సింగారం ఊర చెరువు సమీపంలో, ఉప్పునుంతల మండలం పెనిమెళ్ళ గ్రామానికి వెళ్లే మార్గంలో ఈ లీకేజీ ఏర్పడినట్లు గ్రామస్థులు తెలిపారు.

మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్ పైప్లైన్ నుంచి నిరంతరంగా నీరు లీక్ అవుతుండటంతో ఆ నీరంతా చెరువు సమీపంలోని గుంతల్లో చేరుతోంది. దీంతో శుద్ధి చేసిన తాగునీరు వృథా కావడంతో పాటు నీటి నాణ్యతపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికుల కథనం ప్రకారం, లీకేజీ కారణంగా నీరు మట్టి, చెత్త, ఇతర వ్యర్థాలతో కలిసే ప్రమాదం ఉందని, దీంతో ముందరి గ్రామాలకు సరఫరా అయ్యే తాగునీరు కలుషితం అయ్యే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సరఫరా వ్యవస్థలో చిన్న లోపాలు కూడా ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని గ్రామస్థులు పేర్కొంటున్నారు.



**లీకేజీ వల్ల కలిగే నష్టాలు**

వేల లీటర్ల శుద్ధి చేసిన తాగునీరు వృథా కావడం. ప్రభుత్వ నిధులు, విద్యుత్ వ్యయం అనవసరంగా పెరగడం. పైప్లైన్లో ఒత్తిడి తగ్గి చివరి గ్రామాలకు తగినంత నీరు అందకపోవడం. లీకేజీ ప్రాంతంలో మురుగు, మట్టి లేదా ఇతర కలుషిత పదార్థాలు పైప్లైన్లోకి ప్రవేశించే ప్రమాదం. నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు ప్రబలే అవకాశం. రోడ్డు పక్కన నీరు నిల్వ ఉండటం వల్ల దోమల పెరుగుదల, పారిశుద్ధ్య సమస్యలు ఏర్పడే ప్రమాదం. భవిష్యత్తులో పైప్లైన్ మరింత దెబ్బతిని పెద్ద ఎత్తున నీటి సరఫరా నిలిచిపోయే అవకాశం.

గ్రామస్థులు పలుమార్లు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదని ఆరోపిస్తున్నారు. రోజురోజుకూ లీకేజీ పెరుగుతుండటంతో నీటి వృథా మరింత అధికమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వెంటనే చర్యలు తీసుకోవాలి**

సంబంధిత మిషన్ భగీరథ అధికారులు, గ్రామీణ నీటి సరఫరా శాఖ సిబ్బంది వెంటనే స్పందించి లీకేజీ ప్రాంతాన్ని పరిశీలించి పైప్లైన్కు మరమ్మతులు చేపట్టాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే తాగునీరు కలుషితం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు, నీటి నాణ్యతను పరీక్షించాలని కోరుతున్నారు.

ప్రజల కోసం కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పథకం లక్ష్యాలను దెబ్బతీసే విధంగా తాగునీరు వృథా కాకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

---

# ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

**– తల్లి, శిశు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్య కల్పిస్తుంది.....**
**పోషకాహార లోపం ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి,**
**గర్భిణీలు, బాలింతలకు మెరుగైన సేవలు అందించాలి,**
**'అమ్మ మాట – అంగన్వాడి బాట' కార్యక్రమాన్ని ఆకస్మికంగా పరిశీలించిన,**
**నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్....**



ఉమ్మడి మహబూబ్ నగర్ మే 30 (మనం బ్యూరో): తల్లి, శిశు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన 'అమ్మ మాట - అంగన్వాడీ బాట' కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవలు, పోషకాహార పంపిణీ, ఆరోగ్య పరిరక్షణ చర్యలు, నమోదు వివరాలు తదితర అంశాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రం ద్వారా అమలవుతున్న కార్యక్రమాలపై అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. 'అమ్మ మాట - అంగన్వాడీ బాట' కార్యక్రమం ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ వారికి అవసరమైన పోషకాహారం, వైద్య సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు ప్రతి అర్హులైన కుటుంబానికి చేరేలా సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. చిన్నారుల ఎదుగుదల, బరువు, ఎత్తు వంటి వివరాలను క్రమం తప్పకుండా నమోదు చేసి ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి వారికి అవసరమైన అదనపు పోషకాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. గర్భిణీలు తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలని కలెక్టర్ పేర్కొన్నారు. బాలింతలు, గర్భిణీలు పోషకాహారంపై అవగాహన పెంపొందించుకుని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సందర్శన సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలోని రికార్డులు, హాజరు పట్టికలు, గుడ్లు, పోషకాహార నిల్వలు, పంపిణీ విధానాలను పరిశీలించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. కేంద్రానికి వచ్చిన గర్భిణీలు, బాలింతలతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో తల్లి, శిశు ఆరోగ్యంపై మరింత అవగాహన కల్పిస్తూ ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.



---

# మామిళ్ళపల్లి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**ఆలయ అభివృద్ధికి ప్రభుత్వ సహకారం**

**అందేలా కృషి చేస్తాం – కలెక్టర్**

ఉప్పునుంతల, మే 30 (మనం న్యూస్): మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మామిళ్ళపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని నాగర్కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ శనివారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ వేముల నరసింహారావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు, అధికారులు కలెక్టర్కు ఘన స్వాగతం పలికారు. మేళతాళాలు, పూర్ణకుంభంతో సంప్రదాయబద్ధంగా ఆలయానికి ఆహ్వానించి స్వాగత సత్కారం చేశారు.

ఆలయంలోకి చేరుకున్న కలెక్టర్కు వేద పండితులు ఆశీర్వచనాలు అందించగా, అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ విశిష్టత, చారిత్రక ప్రాధాన్యత గురించి ఆలయ నిర్వాహకులు కలెక్టర్కు వివరించారు. పూజల అనంతరం ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై ఆలయ కమిటీ సభ్యులతో కలెక్టర్ చర్చించారు.ఈ సందర్భంగా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ, మామిళ్ళపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన క్షేత్రమని పేర్కొన్నారు. ఇలాంటి పురాతన దేవాలయాల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. ఆలయానికి అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనుల విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.అనంతరం కలెక్టర్ ఆలయ కమిటీ చైర్మన్ వేముల నరసింహారావుతో పాటు వివిధ శాఖల అధికారులతో సమావేశమై మండల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకుని అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందించాలని అధికారులను అభినందించారు.తదుపరి గ్రామంలో కొనసాగుతున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను కలెక్టర్ పరిశీలించారు. ఉపాధి పనుల వద్దకు చేరుకున్న కలెక్టర్కు కూలీలు, మహిళా సంఘాల ప్రతినిధులు ఆత్మీయ స్వాగతం పలికారు. గ్రామాభివృద్ధిలో మహిళా సంఘాలు, ఉపాధి హామీ కార్మికుల పాత్ర ప్రశంసనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మొక్కను అందించి కలెక్టర్ను సన్మానించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అద్దంకి సునీత, ఉప తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో వరుణ్ తేజ, మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్, సర్పంచ్ మోహన్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ఊరుకొండకు ఊరడింతేనా?

### ఓట్లవేల మురిపించి...సీట్లెక్కాక మరిచారు!!
### గత ప్రభుత్వంలో నిరాశ...నేడు ఆశ!!
### సంక్షేమ రాజ్యంలో...సమీకృత కార్యాలయాలు ఏర్పాటయ్యేనా!!
### సంక్షేమ పాలనలో మైలురాయి--సమీకృత సముదాయాలు!!




ఊరుకొండ మే 30 (మనం న్యూస్): స్థానిక ఊరుకొండ మండలం శనివారం ప్రజా ప్రభుత్వంలో ప్రజల అవసరాలను గుర్తించి వారి ముంగిటకే...పారదర్శక పాలను తీసుకువచ్చే విధంగా,అర్హులకు సంక్షేమ పథకాలు నేరుగా చేర వేయడంలో వేగంగా ఈ వ్యవస్థకు ఒక దిక్సూచిలా ప్రజల సమస్యలకు నిలువుటదంల ఏర్పాటు చేయాల్సిన సమీకృత సముదాయాలు నేటికీ మండలంలో ఏర్పాటు కాకపోవడం గమనార్హం.ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేద వాడి మొహంలో చిరునవ్వు చూడడమే లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రయాణం సఫలీకృతం కావాలని ఆకాంక్షిద్దామని మండల వ్యాప్తంగా ప్రజల నాడి తెలుస్తోంది...ప్రజా సంక్షేమమే పరమావధిగా సాగే రాజ్యంలో,పాలన ప్రజల చెంతకు చేరాలి అనే నినాదంతో గతంలో ఒక చిన్న పని కోసం సామాన్యుడు వివిధ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సి వచ్చేది.ప్రజల ఇబ్బందులను తొలగిస్తూ ఆధునిక వసతులతో ఒకే చోట అన్ని ప్రభుత్వ విభాగాలు చేర్చడమే సమీకృత కార్యాలయాల యొక్క ముఖ్య ఉద్దేశం...

గత గులాబీ ప్రభుత్వంలో ఊరుకొండ మండల సమీకృత కార్యాలయాల ఏర్పాటు శూన్యం...ఊరుకొండ మండల కేంద్రంగా మార్చడమే గానీ,దానికి తగ్గ హోదా తేవడంలో మాత్రం మునుపటి సర్కార్ ఘోరంగా విఫలమైంది.సమీకృత కార్యాలయాల సముదాయం తెస్తామని ఓట్ల ముందు శభాష్ అనిపించుకుంటున్నారు.తీరా సమయం వచ్చాక నమ్మించి నట్టేట ముంచేస్తున్నారు.'ఓడ ఎక్కేదాకా ఓడ మల్లన్న...ఓడ దిగాకా బోడ మల్లన్న అన్న సామెత స్పష్టంగా ఆపాదించబడిందనేది కళ్ళకు కట్టినట్లు అనిపిస్తుంది.ఊరంతా ఊరుకొండకు ఒరిగిందేమీ లేదని నేటి నగ్నసత్యం.

## మాటల కోటలు...చేతల్లో బోరు బావులు.

అధికారం ఉన్నప్పుడు అమాత్యుల పర్యటనలు అట్టహాసంగా కొనసాగినాయి. ఆఫీసులన్నీ ఒకే చోట తెచ్చి,ప్రజల కష్టాల్ని తీరుస్తామని యాస ప్రాసలతో ప్రసంగలు దంచి కొట్టారు.కానీ నేడు ఊరుకుండ ఊపిరి తీసే సమీకృత కార్యాలయాలు 'ఫైలు' మాత్రం ఆటకెక్కించారు.పక్క మండల లో భవనాలు భళా అనిపిస్తుంటే...ఊరుకొండ మండలంలో మాత్రం ఆఫీసులు 'అద్దె ఇండ్ల'చుట్టూ తిరగాల్సిన దుస్థితి పట్టిందని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ప్రజలకు తిప్పలు...పాలకుల మెప్పులు

సమీకృత భవనం లేకపోవడంతో మండల ఆఫీసు ఒకటి తూర్పుకు ఉంటే ఇంకొకటి పడమరకు ఉంది ఒక పని కోసం వచ్చే సామాన్యుడు 'కాళ్లు అరిగేలా'తిరగాలే తప్ప 'కార్య సాధన' కానే కాదు,అండగా ప్రజలకు నిలవాల్సిన నాయకులు ఊరుకొండ ఆఫీసులో ఊసే ఎత్తడం లేదు,తెలంగాణను ఏర్పాటు చేసుకున్నది మనం పాలన కోసమే అయితే,ఊరుకొండ వాసులకు దక్కింది మాత్రం ఆఫీసుల చుట్టూ 'అలసట' పాలకుల 'నిరాదరణ'.

## నిరాశ మిగిలింది...నిలదీసి రోజు రాలింది.




సమీకృత కార్యాలయాల ఏర్పాటును ఆటకు ఎక్కించి,ఊరుకొండ మండల పరిస్థితిని కేవలం బోర్డులకు పరిమితం చేసిన గత ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తూనే ఉన్నారు.ఇచ్చిన హామీల...నీటి మూటలని చూపించిన ఆశలు కేవలం ఓట్లు నాటకాలని తేలిపోయింది.ఊరుకొండ మండలాన్ని ఉద్ధరిస్తామని చెప్పి,చివరకు 'ఉమ్మడి'గానే మోసం చేసిన పాలకుల వైఖరి తీవ్ర విమర్శలకు తావిస్తుంది.

## ఒకే గొడుగు...కిందకు అన్ని సేవలు

కలెక్టరేట్ మొదలుకొని వ్యవసాయ సంక్షేమ విద్యాశాఖలన్నీ ఒకే ప్రాంగణంలో ఉండటం వల్ల ప్రజలకు సమయం,ప్రయాణ ఖర్చులు ఆదా అవుతాయి.

## పరిపాలన సౌలభ్యం

అధికారులు ఒకరితో ఒకరు సమన్వయం చేసుకోవడం సులభం అవుతుంది.దీనివల్ల ఫైళ్ల కదలిక వేగవంతమైన నిర్ణయాలు త్వరగా తీసుకోవడానికి వీలవుతుంది.

## పారదర్శక జవాబుదారితనం.

ఒకే చోట పర్యవేక్షణ ఉండటం వల్ల అవినీతికి తావు లేకుండా, పారదర్శకమైన పాలన అందుతుందని ప్రజలు ఆశిస్తున్నారు.

## సంక్షేమ పథకాల...వేగవంతం

ఇందిరమ్మ ఇల్లు వంటి ప్రతిష్టాత్మక పథకాలు,ఇతర 6 గ్యారెంటీ పథకాలు అమలులో అధికారుల మధ్య సమన్వయం పెరుగుతుందని,కలెక్టర్ నుంచి క్షేత్రస్థాయి అధికారుల వరకు అందరూ ఒకే ప్రాంగణంలో ఉండటం వల్ల దస్త్రాలు కదలిక వేగవంతమై లబ్ధిదారులకు సకాలంలో సహాయం అందుతుందని ఆకాంక్షిస్తున్నారు.

## ఆధునిక సౌకర్యాలు

ఈ కార్యాలయాలు కేవలం పరిపాలనకే కాక,దివ్యాంగులకు అనుకూలంగా ఉండటం,సందర్శకుల కోసం వేచి ఉండటం, డిజిటల్ సేవా కేంద్రాలు వంటి వసతులతో ప్రజలకు అహ్లాదకరమైన అనుభవాన్ని ఇవ్వడంలో సమీకృత కార్యాలయాల పాత్ర అనిర్వచనీయమని వాపోతున్నారు.ప్రజా ప్రభుత్వం ప్రజల అవసరాలను గుర్తించి, సంక్షేమ రాజ్య స్థాపనలో సమీకృత కార్యాలయాలు ఒక బలమైన పునాది.ఇవి కేవలం భవనాలు మాత్రమే కాదు.ప్రజల నమ్మకానికి ప్రతీకలు,ఈ విప్లవాత్మకమైన మార్పు ద్వారా పాలనలో వేగం నాణ్యత పెరిగి ప్రజాసేవలో అద్భుతమైన ఫలితాలు లభిస్తున్నాయని ప్రజల ప్రధానమైన విశ్వాసం.ప్రజా ప్రభుత్వంలో ప్రజల అవసరాలను గుర్తించి వారి ముంగిటకే పాలనను తీసుకువచ్చిన ఈ సమీకృత కార్యాలయాల విధానం అభినందనీయా.పాలనను ప్రజలకు చేరువ చేయడంలో ఈ సమీకృత భవనాలు అద్భుతమైన పాత్ర పోషిస్తున్నాయి.అత్యాధునిక సాంకేతికతతో,ప్రజలకు అవసరమైన కనీస వసతులతో వీటిని నిర్మించటం,ప్రభుత్వ దూర దృష్టికి నిదర్శనమని, సామాన్యుడికి రాజ్యసభల అనిపించే ఈ సమీకృత కార్యాలయాల సముదాయం ఏర్పాటు సముచితమే...






# వరి కొనుగోళ్లలో జాప్యంపై ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆగ్రహం

## రైతులకు ఇబ్బందులు కలగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలి

మహబూబ్ నగర్,మే 30(మనం ప్రతినిధి)వరి ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యం చోటుచేసుకోకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసేలా పారదర్శకంగా, వేగవంతంగా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

మహబూబ్నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా స్థాయి వరి ధాన్యం కొనుగోళ్ల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని పలు కీలక అంశాలను ప్రస్తావించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితులు తలెత్తకూడదని, ధాన్యం తూకం, రవాణా, నిల్వ, చెల్లింపుల ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోకుండా కఠిన పర్యవేక్షణ ఉండాలని సూచించారు.

సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి సమక్షంలో ఎమ్మెల్యే జడ్చర్ల నియోజకవర్గ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యంగా కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కొరత, ధాన్యం తరలింపులో జాప్యం, చెల్లింపుల ఆలస్యం వంటి అంశాలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.




రైతుల కష్టార్జిత పంటకు సరైన గౌరవం దక్కేలా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పూర్తిగా అమలు చేయాలని, కొనుగోలు కేంద్రాల వద్ద మధ్యవర్తుల జోక్యానికి అవకాశం ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. రైతుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించినట్లు సమావేశ వర్గాలు తెలిపాయి.

ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ, మార్కెటింగ్, పౌర సరఫరాల శాఖల ఉన్నతాధికారులు ఈ సమీక్ష సమావేశంలో పాల్గొని కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

'రైతు కేంద్రంగా కొనుగోలు వ్యవస్థ పనిచేయాలి.. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం సహించబోం' అని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పష్టం చేసినట్లు సమావేశంలో పాల్గొన్న అధికారులు వెల్లడించారు.

# మహిళా శక్తితో మార్కెట్ రంగంలో విప్లవం..!

**ప్రతి నియోజకవర్గంలో మహిళా శక్తి సూపర్ మార్కెట్**
**- లక్షలాది మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దనున్న ప్రభుత్వం**
**మహబూబ్నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి వెల్లడి**




మహబూబ్నగర్, మే 30(మనం ప్రతినిధి)మహిళలను కేవలం స్వయం సహాయక సంఘాలకే పరిమితం చేయకుండా, నేరుగా వ్యాపార రంగంలోకి తీసుకువచ్చి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రణాళికకు శ్రీకారం చుట్టిందని ప్రభుత్వ విప్, మహబూబ్నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో 'మహిళా శక్తి సూపర్ మార్కెట్' ఏర్పాటు చేసి మహిళలకే యాజమాన్య హక్కులు కల్పించే దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందన్నారు.

శనివారం మహబూబ్నగర్ నగరంలోని బృందావన్ క్లాసిక్ గార్డెన్లో జరిగిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు.

మహిళల ఆర్థిక సాధికారతకు ఇది చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్న యెన్నం, ప్రతి మహిళా శక్తి సూపర్ మార్కెట్లో మహిళలనే భాగస్వాములు, షేర్హోల్డర్లుగా చేర్చి, నిర్వహణ బాధ్యతలు కూడా వారికే అప్పగించనున్నట్లు వెల్లడించారు. దీంతో మహిళలు ఉద్యోగాలు కోరుకునే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదుగుతారని అన్నారు.

'మహిళలను భాగస్వాములుగా చేస్తే ఈ వ్యవస్థ రేపు భారీ కార్పొరేట్ సంస్థగా మారుతుంది' అనే తన సూచనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి, వెంటనే విధివిధానాల రూపకల్పనకు అధికారులను ఆదేశించారని యెన్నం వెల్లడించారు.

ప్రతి జిల్లా, ప్రతి నియోజకవర్గంలో మహిళా శక్తి సూపర్ బజార్లు ప్రారంభించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రభుత్వ స్థలాలను తక్కువ లీజుకు కేటాయించడం, రిటైల్ రంగంలో ప్రత్యేక శిక్షణ అందించడం ద్వారా మహిళలను విజయవంతమైన వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు.

ఇదే కాకుండా భవిష్యత్తులో రైస్ మిల్లులు, పారిశ్రామిక యూనిట్లు, ఉత్పత్తి కేంద్రాల నిర్వహణలో కూడా మహిళలకు కీలక పాత్ర కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ప్రకటించారు.

కార్యక్రమంలో వేలాది మంది మహిళలు పాల్గొని ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలపగా, మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం తీసుకొస్తున్న ఈ కొత్త విధానం రాష్ట్రంలో మహిళా సాధికారతకు నూతన దిశ చూపనుందని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

'స్వయం సహాయక సంఘాల నుంచి సూపర్ మార్కెట్ల యజమానుల దాకా... మహిళల ఆర్థిక ప్రస్థానంలో తెలంగాణ ప్రభుత్వం మరో చారిత్రాత్మక అడుగు' అని మహిళా సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

# విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి



**-ప్రైవేటు విద్యా సంస్థలలో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఇవ్వాలి.**
**-అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి.**
**-ఆర్టిఏ అధికారులు పాఠశాలల బస్సులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.**
**-బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్.**

వనపర్తి మే 30 (మనం ప్రతినిధి): అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్న ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలపై విద్యార్థుల తల్లిదండ్రుల  పక్షాన పోరాటం కొనసాగిస్తామని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ పేర్కొన్నారు.

శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... త్వరలోనే పాఠశాలలు, కళాశాలలు ప్రారంభం కాబోతున్న తరుణంలో విద్యాశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రతి ప్రైవేటు పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం ప్రకారం 25% సీట్లను పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాలని అన్నారు.

జిల్లాలో కొందరు చదువుల పేరుతో వ్యాపారం చేస్తున్నారని, పాఠశాలల్లోనే పుస్తకాలు, యూనిఫామ్, టై, బెల్టు, షూ అమ్ముతూ అక్రమాలకు పాల్పడుతున్నారని, అలాంటి పాఠశాలలపై బీసీ పొలిటికల్ జేఏసీ ప్రత్యేక నిఘా పెడుతుందని హెచ్చరించారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతున్న సందర్భాన్ని దృష్టిలో ఉంచుకొని ఆర్టిఏ అధికారులు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల బస్సుల ఫిట్నెస్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గతంలో అనేకసార్లు ప్రమాదాలు చోటుచేసుకుని విద్యార్థులు గాయపడి, మృతి చెందిన సందర్భాలను ఆయన గుర్తు చేశారు.  నేడు ప్రభుత్వ విద్య గణనీయంగా మెరుగుపడిందని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు. బీఈడీ, పీజీ పూర్తి చేసి ఎంతో అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో విద్యను బోధిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు కార్పొరేటు మోజులో పడి లక్షల రూపాయలను వృధా చేసుకోవద్దని హితవు పలికారు. నాణ్యమైన విద్య అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలకే తమ పిల్లలను పంపించేలా కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రైవేటు పాఠశాలలు, కార్పొరేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయకపోతే వాటిని సీజ్ చేపించే వరకు బీసీ పొలిటికల్ జేఏసీ విశ్రమించదని హెచ్చరించారు. నామినల్ ఫీజులు తీసుకుంటూ, ఉత్తమ విద్య అందిస్తున్న పాఠశాలలకు మాత్రం తమ సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వి వి గౌడ్, జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్, కృష్ణ ప్రసాద్, అస్కని రమేష్ తదితరులు పాల్గొన్నారు.




# మహిళల భాగస్వామ్యంతో మహిళా శక్తి సూపర్ మార్కెట్లు

**మహిళలను విజయవంతమైన వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యం**
**ప్రతి నియోజకవర్గంలో ఒక మహిళా శక్తి సూపర్ మార్కెట్లు**
**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

మహబూబ్ నగర్, 30మే, (మనం న్యూస్ ): మహిళలకు సూపర్ మార్కెట్లు నిర్వహించుకునేల ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. శనివారం మహబూబ్నగర్ నగరంలోని బృందావన్ క్లాసిక్ గార్డెన్లో నిర్వహించిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల సభ్యులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, మహబూబ్నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళల ఆర్థిక సాధికారతకు తోడ్పడేలా రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో మహిళా శక్తి సూపర్ మార్కెట్లు ఏర్పాటు చేసి, మహిళా సంఘాల సభ్యులను భాగస్వాములుగా, షేర్హోల్డర్లుగా చేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఈ సూపర్ మార్కెట్లను మహిళలే నిర్వహిస్తూ, వారి అవసరాలకు అనుగుణంగా సేవలు అందించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా లక్షలాది మహిళలకు ఉపాధి, గౌరవం కలుగుతుందని ఆయన చెప్పారు.మహిళలను భాగస్వాములుగా చేస్తే ఈ వ్యవస్థ భవిష్యత్తులో పెద్ద కార్పొరేట్ సంస్థగా ఎదగగలదని ఎమ్మెల్యే సూచించగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి, వెంటనే విధివిధానాల రూపకల్పనకు అధికారులను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు.

రాబోయే రోజుల్లో ప్రతి జిల్లా, నియోజకవర్గంలో మహిళా శక్తి సూపర్ బజార్లు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తక్కువ లీజుతో ప్రభుత్వ స్థలాలు ఇవ్వడం, రిటైల్ రంగంలో శిక్షణ అందించడం ద్వారా మహిళలను విజయవంతమైన వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా జరిగిన కృతజ్ఞత సభలో  వేలమంది మహిళలు పాల్గొని ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో రైస్ మిల్లులు, ఇతర పారిశ్రామిక యూనిట్ల నిర్వహణలో కూడా మహిళలకు అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారే పల్లి సురేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ను ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

**- క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వానికి పునాది**

అచ్చంపేట మే 30 (మనం న్యూస్): క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. నల్గొండ జిల్లా డిండి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న జలంధర్ రెడ్డి డీసీసీ రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్కు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పోటీలను ఘనంగా ప్రారంభించారు.

ముందుగా టాస్ వేసి టోర్నమెంట్ను ప్రారంభించిన ఎమ్మెల్యే, అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ యువత విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబర్చాలని సూచించారు. క్రీడలు వ్యక్తిలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గెలుపు-ఓటములను సమానంగా స్వీకరించే మనస్తత్వాన్ని క్రీడలు నేర్పుతాయని అన్నారు.

క్రికెట్ వంటి క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. క్రమం తప్పకుండా






క్రీడల్లో పాల్గొనడం వల్ల శరీర దారుఢ్యం పెరగడం, గుండె ఆరోగ్యం మెరుగుపడడం, ఏకాగ్రత పెరగడం, ఒత్తిడి తగ్గడం వంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయని చెప్పారు. అదేవిధంగా జట్టు భావన, పరస్పర సహకారం, సమయపాలన, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం కూడా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని, భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులను తయారు చేయడానికి ఇవి ఉపయోగపడతాయని ఎమ్మెల్యే అన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలను జీవనంలో భాగం చేసుకోవాలని సూచించారు. అనంతరం క్రీడాకారులతో ముచ్చటించిన ఎమ్మెల్యే, క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. టోర్నమెంట్ను విజయవంతంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడా నిర్వాహకులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు, యువకులు, క్రికెట్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలు విజయవంతంగా సాగి యువ క్రీడాకారులకు మంచి భవిష్యత్తుకు మార్గం సుగమం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆకాంక్షించారు.



## ఎక్సైజ్ నేరాల స్వాధీనం వాహనాల వేలం ద్వారా రూ.4.22 లక్షల ఆదాయం

కల్వకుర్తి రూరల్, మే 30 (మనం న్యూస్): కల్వకుర్తి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఎక్సైజ్ నేరాలకు సంబంధించిన స్వాధీనం వాహనాల బహిరంగ వేలం విజయవంతంగా ముగిసింది. ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి మొత్తం రూ.4,22,016 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలంలో మొత్తం 18 వాహనాలను వేలానికి ఉంచగా, వాటిలో 14 వాహనాలను ఆసక్తిగల కొనుగోలుదారులు దక్కించుకున్నారు.ప్రభుత్వం నిర్ణయించిన కనీస ధర రూ.2,95,000 కాగా, జీఎస్టీతో కలిపి మొత్తం రూ.4,22,016 ఆదాయం లభించినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... ఎక్సైజ్ నేరాల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరగడంతో పాటు, నిల్వలో ఉన్న వాహనాల నిర్వహణ భారం కూడా తగ్గుతుందని తెలిపారు. వేలం ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించి, ప్రభుత్వ ఆదాయ వనరులను పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.నాగర్కర్నూల్ జిల్లా ఎక్సైజ్ అధికారి డి. గాయత్రి సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జె. వెంకట్ రెడ్డి, సిబ్బంది జంగయ్య, మునీందర్, చంద్రశేఖర్, జనార్ధన్ రెడ్డి, సిద్ధార్థ్, అనిల్, తేజశ్రీ, సునీత తదితరులు పాల్గొన్నారు. అధికారులు వేలం ప్రక్రియను పర్యవేక్షించి, కొనుగోలుదారులకు అవసరమైన వివరాలను అందజేశారు.

## బిఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీల తొలగింపు పట్ల మున్సిపల్ కమిషనర్కు వినతి




కొత్తకోట, మే 30 (మనం న్యూస్): పట్టణ పరిధిలో తెలంగాణ చౌరస్తాలో గత కొంతకాలంగా మా నాయకుడు దేవరకద్ర మాజీ శాసనసభ్యులు ఆల వెంకటేశ్వర్ రెడ్డి మరియు బిఆర్ఎస్ నాయకుల సంబంధించిన ఫ్లెక్సీలు వేసిన రెండు రోజులకే ఏలాంటి సమాచారం లేకుండానే తొలగింపుపై శనివారం కొత్తకోట మున్సిపాలిటీ కమిషనర్ ను వివరణ కోరుతూ.. మరియు జూన్ 3వ తేదీ బిఆర్ఎస్ పార్టీ డిజిటల్ సభ్యత్వ మరియు ఖిఐఖసన్నాహక కార్యక్రమ సమావేశాన్ని పురస్కరించుకొని వేయబోయే పార్టీ ఫ్లెక్సీల మాటగా అనుమతి కోరుతూ వినతి పత్రం ఇచ్చిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉమ్మడి జిల్లా మాజీ సిడిసి చైర్మన్ బీసం చెన్నకేశవరెడ్డి ,కౌన్సిలర్లు అయ్యన్న,ఎరుకలి తిరుపతయ్య, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు ఆకుల శ్రీనివాసులు ,మాజీ కౌన్సిలర్లు చింతలపల్లి సంధ్యా రవీందర్ రెడ్డి,రాముల యాదవ్,మూలమల్ల యుగంధర్ రెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యులు అద్వానీ శ్రీనువాసులు,గంగారపు మెగారెడ్డి,మాజీ డైరెక్టర్ చాపల భాస్కర్,మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మాక్ పార్లమెంట్‌తో యువతలో నాయకత్వ లక్షణాలు

**- జిల్లా ఎస్పీ డి.జానకి**

మహబూబ్ నగర్, 30మే,(మనం న్యూస్ ): జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహబూబ్నగర్ ఐడీఓసీ కార్యాలయంలో కౌమార దశలో ఉన్న విద్యార్థుల కోసం మాక్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డి.జానకి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, యువత దేశ భవిష్యత్తుకు పునాదులని, వారికి ప్రజాస్వామ్య వ్యవస్థ, రాజ్యాంగ విలువలు మరియు పాలనా విధానాలపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమని తెలిపారు. మాక్ పార్లమెంట్ వంటి






కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సమస్యల పరిష్కార సామర్థ్యం మరియు సామాజిక బాధ్యత పెంపొందుతాయని పేర్కొన్నారు.

అదేవిధంగా కౌమార దశలో ఉన్న విద్యార్థులకు వ్యక్తిగత భద్రత , పౌష్టికాహారం , ఆరోగ్యకరమైన జీవనశైలి, సైబర్ భద్రత, బాల్య వివాహాల నివారణ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, మహిళలు మరియు బాలికల రక్షణకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. మంచి ఆరోగ్యం, సమతుల ఆహారం మరియు సురక్షిత జీవన విధానం విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని వివరించారు.

విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకొని క్రమశిక్షణతో ముందుకు సాగాలని,



విద్యతో పాటు నైతిక విలువలను అలవర్చుకోవాలనిసూచించారు.సమాజాభివృద్ధిలో యువత చురుకైన పాత్ర పోషించాలని, దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా విద్యార్థులు పార్లమెంట్ కార్యకలాపాలను అనుకరిస్తూ వివిధ ప్రజా సమస్యలపై చర్చించి తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ అధికారి నర్సింహులు, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి శ్రీమతి జరీనా , ఇతర అధికారులు, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో కౌమార దశలో ఉన్న విద్యార్థులు పాల్గొన్నారు.

# అనారోగ్య బాధితురాలికి మిత్ర ఫౌండేషన్ ఆర్థిక సహాయం



కల్వకుర్తి రూరల్ , మే 30 (మనం న్యూస్): కల్వకుర్తి పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీకి చెందిన ఆబేదా బేగం బ్రెయిన్లో రక్తం గడ్డకట్టడం (బ్రెయిన్ బ్లడ్ క్లాట్) కారణంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండటంతో ఆమె చికిత్సకు అవసరమైన ఖర్చులను భరించడం కుటుంబ సభ్యులకు భారంగా మారింది.ఆబేదా బేగం ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్న మిత్ర ఫౌండేషన్ సభ్యులు ఆమె కుటుంబాన్ని పరామర్శించి పరిస్థితిని పరిశీలించారు. అనంతరం మానవతా దృక్పథంతో స్పందించిన ఫౌండేషన్ ప్రతినిధులు ఆమె వైద్య చికిత్స నిమిత్తం రూ.5,000ల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ.. సమాజంలో ఆపదలో ఉన్న వారికి తమ వంతు సహాయం అందించడం మిత్ర ఫౌండేషన్ లక్ష్యమని తెలిపారు. బాధితురాలు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, అవసరమైన సమయంలో మరింత సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మిత్ర ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు రావుఫ్, కార్యదర్శులు కార్తిక్, శ్రీకాంత్ గౌడ్, సభ్యులు రసూల్ ఖాన్, శేఖర్ రెడ్డి, హలీమ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్య సేవలకు జీవితాన్నే అంకితం చేసిన ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

**డి యం అండ్ హెచ్ ఓ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి లు....**

**- వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.వి. స్వరాజ్యలక్ష్మికి ఘన పదవీ విరమణ సన్మానోత్సవ కార్యక్రమం....**





ఉమ్మడి మహబూబ్ నగర్ మే 30 (మనం బ్యూరో): ప్రజారోగ్య రంగంలో మూడు దశాబ్దాలకు పైగా విశిష్ట సేవలందించి వేలాది మంది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన నాగర్కర్నూల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (ఎఫ్ఏసీ) డాక్టర్ కె.వి. స్వరాజ్యలక్ష్మి సేవలు చిరస్మరణీయమని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ కొనియాడారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో డాక్టర్ స్వరాజ్యలక్ష్మికి ఆత్మీయ పదవీ విరమణ సన్మానోత్సవం అత్యంత వైభవంగా, భావోద్వేగ వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ.....ప్రజల ఆరోగ్య పరిరక్షణను తన విధిగా కాకుండా సేవా ధర్మంగా భావించి పనిచేసిన అరుదైన అధికారిణిగా డాక్టర్ స్వరాజ్యలక్ష్మి నిలిచారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల విస్తరణలోనూ, ప్రజారోగ్య కార్యక్రమాల అమలులోనూ ఆమె చూపిన అంకితభావం యువ వైద్యులకు ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే కొనియాడారు. పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి మాత్రమే పరిమితమన్నారు. సమాజ సేవకు మాత్రం ముగింపు కాదని పేర్కొంటూ, భవిష్యత్తులోనూ ఆమె తన అనుభవాన్ని సమాజ శ్రేయస్సుకు వినియోగించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ దంపతులను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. ఆమె శేష జీవితం ఆనందమయం, ఆరోగ్యమయం, సుఖసంతోషాలతో నిండాలని శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎల్.బి. దేవసహాయం, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) పి. అమరేందర్, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి సేవలను ప్రశంసిస్తూ, ప్రజారోగ్య రంగంలో ఆమె చేసిన కృషి జిల్లాకు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఇంచార్జ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవికుమార్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ వెంకటదాస్, డాక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ డీఎంఅండ్హెచ్ఓలు, వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బంది, ఆరోగ్య శాఖకు చెందిన పలువురు అధికారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, పర్యవేక్షణ అధికారులు, సిబ్బంది, మిత్రులు, బంధువులు కలిసి డాక్టర్ స్వరాజ్యలక్ష్మి గారి సేవలను స్మరించుకుంటూ ఆమెకు హృదయపూర్వకంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమం మొత్తం ఆత్మీయత, కృతజ్ఞతాభావం, గౌరవప్రదమైన సన్మానాలతో నిండిపోయింది.

---




## పాలమూరుకు పదేళ్లు అన్యాయం చేసిన వారే ఇప్పుడు గొప్పలు చెప్పుకుంటున్నారు

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

మహబూబ్నగర్, మే 30(మనం ప్రతినిధి)పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పేరుతో ప్రజలను మోసం చేసిన గత పాలకులపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మహబూబ్నగర్ జిల్లా పర్యటనలో భాగంగా నిర్వహించిన సమీక్ష సమావేశం, అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ళ అధికారంలో ఉన్న ప్రభుత్వం ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందించలేదని మండిపడ్డారు. 'ప్రాజెక్టులు పూర్తయ్యాయని అబద్ధపు ప్రచారం చేశారు. కానీ రైతుల పొలాలకు నీరు చేరలేదు. పాలమూరును రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారు తప్ప అభివృద్ధి చేయలేదు' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

పాలమూరు-రంగారెడ్డి, నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా, కోయిల్సాగర్ వంటి కీలక ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు శాశ్వత సాగునీటి భరోసా కల్పిస్తామని స్పష్టం చేశారు. ఇందుకోసం వేల కోట్ల రూపాయల నిధులను కేటాయించి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు.

ప్రతి గింజను కొనుగోలు చేస్తాం.. రైతులు ఆందోళన చెందొద్దువరిధాన్యం కొనుగోళ్లపై కూడా మంత్రి కీలక ప్రకటన చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆశించిన సహకారం అందించకపోయినా రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులతో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తోందని తెలిపారు.'రైతు పండించిన ప్రతి గింజకు మద్దతు ధర చెల్లిస్తాం. అకాల వర్షాలతో తడిసిన ధాన్యం విషయంలో కూడా రైతులు భయపడాల్సిన అవసరం లేదు. ఒక్క గింజ కూడా నష్టపోకుండా ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుంది' అని హామీ ఇచ్చారు.

**రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**

రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకుని పనిచేస్తోందని పేర్కొన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి, గతంలో నిర్లక్ష్యానికి గురైన పాలమూరు ప్రాంతాన్ని సాగునీరు, వ్యవసాయం, అభివృద్ధి పరంగా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.

ప్రాజెక్టుల పేరుతో ప్రచారం చేసుకుని ప్రజలను మభ్యపెట్టిన వారి నిజస్వరూపాన్ని ప్రజలు ఇప్పటికే గుర్తించారని, ఇప్పుడు ఫలితాలు చూపించే పాలన కొనసాగుతోందని మంత్రి స్పష్టం చేశారు.

---

## విజయవంతంగా కొనసాగుతున్న వేసవి కబడ్డీ శిక్షణ శిబిరం

**రాష్ట్ర స్థాయికి క్రీడాకారులను తీర్చిదిద్దుతున్న వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్**



ఉప్పునుంతల, మే 30 (మనం న్యూస్): మండలంలోని వెల్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత 30 రోజులుగా నిర్వహిస్తున్న సమ్మర్ కబడ్డీ శిక్షణ శిబిరం విజయవంతంగా కొనసాగుతోంది. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు 40 మంది విద్యార్థులు ప్రతిరోజూ కబడ్డీ శిక్షణ పొందుతున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్ తెలిపారు.గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్తో పాటు గ్రామ యువత, ప్రజాప్రతినిధులు శిబిర నిర్వహణకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు. శిక్షణ పొందేందుకు విద్యార్థుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటం గ్రామంలో క్రీడల పట్ల పెరుగుతున్న ఆసక్తికి నిదర్శనంగా నిలుస్తోంది. యువత ప్రోత్సాహంతో విద్యార్థులు క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో శిక్షణ పొందుతున్నారు.వెల్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ పొందిన పలువురు కబడ్డీ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం గ్రామానికి గర్వకారణమని మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా సరైన శిక్షణ, ప్రోత్సాహం ఉంటే విద్యార్థులు ప్రతిభ చాటగలరని ఈ శిబిరం నిరూపిస్తోందని వారు పేర్కొన్నారు.అదే సమయంలో మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడారంగంలో వెనుకబడిపోవడం పట్ల పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించే కార్యక్రమాలు మరింతగా నిర్వహించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

వెల్టూరు పాఠశాల క్రీడా మైదానాన్ని మరింత విస్తరించి, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. క్రీడలు విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొంటూ గ్రామ యువత క్రీడల్లో రాణించి వెల్టూరు గ్రామానికి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.సమ్మర్ కబడ్డీ శిక్షణ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్ను గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్, మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు. క్రీడల అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి ఆదర్శప్రాయమని కొనియాడారు.

---

## రాజ్యాధికారంతోనే బీసీలకు న్యాయం

**బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా అధ్యక్షులు శ్రీవిద్య గౌడ్.. అరవింద్ చారి!!**



నాగర్ కర్నూల్ (మన న్యూస్ మే 30 ): నాగర్ కర్నూల్ జిల్లాలో ఎండబెట్ల. తాడూరు మండలంలో బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీవిద్య గౌడ్ సీతారాల కలిసి శనివారం రోజున బిసి పొలిటికల్ జేఏసీ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. నాగర్ కర్నూల్ టౌన్ ప్రెసిడెంట్ గొడుగు రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ సి, దశరథం, మహిళా కార్యదర్శి గొడుగు, శివమ్మ, టౌన్ యూత్ ప్రెసిడెంట్ మహేష్, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, టౌన్ యూత్ ప్రెసిడెంట్ రాములు నాగర్ కర్నూల్ కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. తాడూరు మండల అధ్యక్షులుగా యార రమేష్ చిన్న, ఉపాధ్యక్షులు భరత్ కుమార్, సలహాదారులుగా తిరుపతయ్య, బుచ్చయ్య, సోషల్ మీడియా శివ, తాడూరు మండలం మహిళా అధ్యక్షురాలుగా అనిత, వర్కింగ్ ప్రెసిడెంట్ వై, మల్లేష్, యూత్ ప్రెసిడెంట్ జి, కురుమయ్య, మహిళ జనరల్ సెక్రటరీగా ఎం, హర్షిత ను తాడూర్ కమిటీ లో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బిసి పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూలు జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ బీసీలకు స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు దాటుతున్నప్పటికీ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు బీసీలకు ఏ రైతు ఉన్నవో రిజర్వేషన్లు కానివ్వండి విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో మనకు రావాల్సిన వాటా మనకు రాకపోవడం మనము రాజకీయంగా లేకపోవడం వల్లనే ఈ రాజ్యాన్ని కొన్ని సామాజిక వర్గాలు మాత్రమే పరిపాలిస్తున్నారు కాబట్టి మనము అన్ని రంగాల్లో వెనుకబాటుతనంగానే మిగిలిపోయాము అన్నారు. అందుకే బీసీ పొలిటికల్ జేఏసీ విస్తృత స్థాయి కమిటీలు వేసి గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు బీసీలను ఏకతాటి పైకి వచ్చి పోరాడవలసిన సందర్భం ఉన్నది. అదేవిధంగా ఓటు చైతన్యం చేస్తూ మన ఓట్లు మనమే వేసుకుని చట్టసభల్లోకి వెళ్ళే విధంగా కృషి చేయాలని కమిటీ సభ్యులకు విజ్ఞప్తి చేశారు.



## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం బిఆర్ఎస్ పార్టీ

**నాయకులు, మాజీ సర్పంచ్ వేనేపల్లి గణేష్ రావు**

వంగూరు మే 30 ( మనం న్యూస్ ): వంగూరు మండల కేంద్రానికి చెందిన భాషమోని శివ బుధవారం మృతి చెందాడు ఈ విషయం తెలుసుకున్న వంగూరు మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు, మాజీ సర్పంచ్ వేనేపల్లి గణేష్ రావు, అక్కి లావణ్యఎల్లాగౌడ్, శనివారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి తండ్రి బాలనారాయణకు 10,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు అలాగే శివ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమం లో కల్వకుర్తి మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ మంద రాజేందర్ రెడ్డి, పార్టీ నాయకులు అంకు సురేందర్, గ్రామ అధ్యక్షులు బండపల్లి జంగయ్య, వార్డు సభ్యులు సుమన్, అక్కి మురళి, నారమోని జంగయ్య, బండపల్లి శివకుమార్, లట్టుపల్లి మురళి, అయినాల రమేష్, బుచ్చిరాములు, నిజాం, తదితరులు పాల్గొన్నారు.

## రైతు డిస్కమ్ రైతాంగానికి శాపం

**మెట్టుకాడి ప్రభాకర్ ముదిరాజ్**

మహబూబ్ నగర్, 30మే, (మనం న్యూస్ ): రైతు డిస్కమ్ పేరుతో తెలంగాణ రైతాంగాన్ని నట్టేట ముంచే కుట్ర జరుగుతోందని తెలంగాణ రక్షణ సేన మహబూబ్నగర్ జిల్లా ఇన్చార్జి మెట్టుకాడి ప్రభాకర్ ముదిరాజ్ విమర్శించారు. శనివారం ఆయన మాట్లాడుతు రైతులు అడగకుండానే ప్రభుత్వం తీసుకొస్తున్న ఈ నిర్ణయం వ్యవసాయానికి ఎండ్రిన్ పోసినట్టేనని అన్నారు.రైతులకు మేలు చేసే నిర్ణయమైతే ప్రభుత్వం ఆరు నెలలుగా ఎందుకు గోప్యంగా ఉంచిందని ప్రశ్నించారు.



డిస్కమ్లకు రూ.69 వేల కోట్ల బకాయిల్లో రూ.54 వేల కోట్లు ప్రభుత్వమే చెల్లించాల్సి ఉందని, ముందుగా ఆ బకాయిలు చెల్లించి ప్రస్తుతం ఉన్న డిస్కమ్లను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.కొత్త రైతు డిస్కమ్ వల్ల రైతులకు ప్రయోజనం కంటే నష్టాలే ఎక్కువగా ఉంటాయని, సిబ్బంది కొరత కారణంగా విద్యుత్ సేవలు మరింత దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. తెలంగాణలోని 29 లక్షల వ్యవసాయ బోర్ల భవిష్యత్తు అనిశ్చితిలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై హైదరాబాద్లో మాత్రమే కాకుండా రాష్ట్రంలోని 33 జిల్లాల్లో పబ్లిక్ హియరింగ్లు నిర్వహించాలని ఈఆర్సీని కోరారు. రైతుల భవిష్యత్తును ప్రభావితం చేసే ఈ ప్రతిపాదనను ఈఆర్సీ తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రైతు డిస్కమ్లో తెలంగాణ ఉద్యోగులకు ప్రాధాన్యం కల్పించాలని, విద్యుత్ రంగంలో తెలంగాణ ఉద్యోగుల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు.

# విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా నిర్మాణాలు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



వంగూర్ మే30 ( మనం న్యూస్ ): మండల పరిధిలోగల పోల్కంపల్లి వంగూరు గ్రామా లో నిర్మాణంలో ఉన్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవన నిర్మాణ పనులను శనివారం కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల భవన నిర్మాణం తరగతి గదులు ఆట స్థలాలు లైబ్రరీ తాగునీటి సదుపాయాలు తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించారు నిర్మాణ పనుల పురో రోగతిని సంబంధిత ఇంజనీర్ అడిగి తెలుసుకున్నారు నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నిర్మిస్తున్న ఈ విద్యా సంవత్సరంలో ప్రతి నిర్మాణం నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు నిర్మాణ సామాగ్రి నాణ్యత భవనాల భద్రత ప్రమాణాలు విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా తరగతి గదుల రూపకల్పన వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాని అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు పాఠశాల ప్రారంభ సమయానికి నిర్మాణ పనులు పూర్తి కాకపోతే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని మిగిలిన పనులు వేగవంతం చేసి నిర్నీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఏ విజయ్ కుమార్ కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి గ్రామ సర్పంచ్ యాదయ్య తాసిల్దార్ మురళీమోహన్ సంబంధిత శాఖల అధికారులు ఇంజనీర్లు కాంట్రాక్టర్లు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# అమ్మ మాట – అంగన్వాడి బాట.. చిన్నారుల భవిష్యత్‌కు బాటలు

**0-5 ఏళ్ల చిన్నారులను అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించండి**

**సిడిపిఓ దమయంతి పిలుపు**



ఉప్పునుంతల, మే 30 (మనం న్యూస్): 0-5 సంవత్సరాల లోపు చిన్నారులను అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించి వారి ఆరోగ్యకరమైన ఎదుగుదల, సమగ్ర అభివృద్ధికి సహకరించాలని ఐసిడిఎస్ బల్మూర్ ప్రాజెక్టు సిడిపిఓ ధమయంతి పిలుపునిచ్చారు.

శనివారం మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో అమ్మ మాట - అంగన్వాడి బాట నినాదంతో, ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి కేంద్రం ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ దమయంతి మాట్లాడుతూ, శిశువు నుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించడం ద్వారా పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, ప్రాథమిక విద్య వంటి సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి అంగన్వాడి కేంద్రాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. అలాగే మండలంలోని వెల్టూరు, దేవదారికుంట తండా గ్రామాల్లో కూడా బడిబాట కార్యక్రమాలను నిర్వహించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయా అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు రెండు జతల యూనిఫాంలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరుణ్ తేజ, సూపర్వైజర్లు బిపాసా, పావని, సర్పంచులు వంగ సాయిబాబు గౌడ్, చింతోజు వెంకటేష్, మంగమ్మ రతన్ సింగ్, ఉపసర్పంచులు నరేష్ యాదవ్, ఉప్పరి మల్లయ్య, వార్డు సభ్యులు, అంగన్వాడి కార్యకర్తలు కొత్త శ్రీలత, నిరంజనమ్మ, వేదవతి, సోనమ్మ, ఆశా కార్యకర్తలు, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

# బాధితుడి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల ఆర్థిక సాయం



వంగూర్ మే30 ( మనం న్యూస్ ): వంగూరు మండల కేంద్రానికి చెందిన బాషమోని బాల్ నారి కుమారుడు శివ మరణించడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న అచ్చంపేట ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షులు డీసీసీ అధ్యక్షులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈరోజు బాధితుడి కుటుంబాన్ని పరామర్శించారు.

ఎమ్మెల్యే సూచనతో బాధిత కుటుంబానికి రూ. 5,000/- (ఐదు వేల రూపాయలు) ఆర్థిక సాయాన్ని అందజేసి, వారికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వంగూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గఫుర్ మాజీ ఎంపీటీసీ, వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్, జయప్రసాద్ రావు, యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, జనార్దన్, మల్లేష్, సైదులు, శేఖర్, రమేష్, సురేష్, దశరథం, నందు, రవి, శ్రీను, ఆనంద్, కృష్ణయ్య, రామస్వామి, వెంకటేష్, పర్వతాలు,బాలయ్య వెంకటయ్య గౌడ్, సత్తి, రాఘవేందర్, పాల్గొన్నారు.

# కొత్ర గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం...

**ప్రజల వద్దకు వచ్చిన ఆరోగ్య సేవలు.**





వెల్దండ మే 30 (మనం న్యూస్ ) మండల పరిధిలోని కొ్త్ర గ్రామంలో గ్రామ సర్పంచ్ శాంపూరి శారద చెన్నయ్య, ఆధ్వర్యంలో మహిత హాస్పిటల్ వారి సహకారంతో, శనివారం గ్రామపంచాయతీ ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా, గ్రామ అభివృద్ధి లక్ష్యంగా సర్పంచ్ శాంపూరి శారద చెన్నయ్య నిరంతరం కృషి చేస్తున్నారు. అందులో భాగంగా శనివారం మహిత హాస్పిటల్ డాక్టర్ కె యశోద భాయ్, డాక్టర్ జె శివరాం, ల సహకారంతో నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ముందుగా గ్రామ సర్పంచ్ శాంపూరి శారద చెన్నయ్య, రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరాన్ని ఉద్దేశించి చెన్నయ్య మాట్లాడుతూ... కాలానికి అనుగుణంగా మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు ఆరోగ్యంగా ఉన్నట్లయితే ఊరు బాగున్నట్లు అని భావించి ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. అదేవిధంగా గ్రామంలోని విద్య, వైద్య, అభివృద్ధి, విషయాలలో మేము నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ ఉచిత ఆరోగ్య శిబిరాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ వైద్య శిబిరాన్ని గ్రామ ప్రజలు చక్కగా సద్వినియోగం చేసుకున్నారని అదేవిధంగా ఈ శిబిరంలో అందరికీ కావాల్సిన నాణ్యమైన మందులను ఉచితంగా పంపిణీ చేశామని వైద్యులు తెలిపారు. వృద్ధులు, మహిళలు, యువకులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారని వైద్యులు తెలిపారు. శిబిరంలో డాక్టర్ సురేష్, డాక్టర్ రాజు, వైద్య సిబ్బంది అజార్, రఘు, గీత, ప్రియాంక, ప్రశాంత్, భారతి తదితర వైద్య సిబ్బంది, అదేవిధంగా గ్రామ ఉపసర్పంచ్ నారిమళ్ళ అన్నమ్మ రాములు, వార్డ్ మెంబర్లు జెనిగల సాయి, కొప్పు మల్లేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జెనిగల మల్లయ్య, కోట్ల శ్రీను, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అసోసియేట్ కార్యవర్గ సభ్యుడిగా బాదం వెంకటేశ్వర్లు



కొత్తకోట, మే 30 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అసోసియేట్ కార్యవర్గ సభ్యుడిగా కొత్తకోటకు చెందిన బాధం వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. శనివారం హైదరాబాదులో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మినారాయణ నియామక పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా బాదం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆర్యవైశ్య మహాసభ అసోసియేట్ కార్యవర్గ సభ్యుడిగా అవకాశం కల్పించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణకు మరియు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

## ఉమామహేశ్వర పాలకమండలి సభ్యురాలిగా నియామకం హర్షించదగ్గ విషయం

**– ఉమామహేశ్వర క్షేత్రంలో ఆర్యవైశ్య మహిళకు పలక మండలిలో రెండోసారి ఎన్నిక....**



ఉమ్మడి మహబూబ్ నగర్ మే 30 (మనం బ్యూరో): తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి పథంలో దూసుకు వెళ్తున్న ఉమామహేశ్వర క్షేత్రం ఒకటిగా పిలవబడుతుంది. శ్రీశైలం ఉత్తర ముఖద్వారంగా పిలవబడుతున్న ఉమామహేశ్వర ఆలయం లో రెండోసారి చైర్మన్ తో పాటు పాలకమండలి సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామానికి చెందిన ఆర్యవైశ్య మహిళ శంభు శోభకు ఆలయంలో రెండోసారి పాలకమండలి సభ్యురాలుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నాపై నమ్మకం, ఆత్మవిశ్వాసం, గౌరవం ఉంచిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆయన సతీమణి డాక్టర్ అనురాధలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా నాతో పాటు రెండుసారి చైర్మన్ అయిన సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు. అమ్రాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండి రహీం, మాజీ అధ్యక్షుడు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి హరి నారాయణలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నాపై నమ్మకం ఉంచి రెండోసారి పాలకమండలి సభ్యురాలుగా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్ననన్నారు.

## పదర మండలం ఆర్యవైశ్య సంఘ అధ్యక్షునిగా కామ్ శెట్టి శ్రీనివాసులు ఎన్నిక

ఉమ్మడి మహబూబ్ నగర్ మే 30 (మనం బ్యూరో): తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుని ఆదేశాల మేరకు నాగర్ కర్నూలు జిల్లా కన్వీనర్ శివకుమార్ బృందం శనివారం అమ్రాబాద్, పదర మండలాలలో ఆర్యవైశ్య సంఘ మండలాల ఎన్నికలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య నాయకులు సంభూ వెంకటరమణ, జూలూరి సత్యనారాయణ, గోపిశెట్టి నర్సింగ్ రావు, సురేష్ లతో పాటు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అమ్రాబాద్ మండలలో పాపిశెట్టి శ్యాంసుందర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు శివకుమార్ తెలిపారు. అలాగే పదర మండలానికి కామ్ శెట్టి శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు విలేకరుల సమావేశంలో శనివారం వెల్లడించారు. గతంలో అధ్యక్షులుగా పనిచేసిన నీల శ్రీనివాసులు, అదేవిధంగా పదర మండలం మాజీ అధ్యక్షుడు బలుస వేణుగోపాల్ ను నాగర్ కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య సంఘంలో ప్రధాన స్థానం కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా రెండు మండలాలలో ఒకే సారి ఇద్దరినీ ఏకగ్రీవంగా అధ్యక్షులను ఎన్నుకున్నందుకు ఆర్య వైశ్యులు ప్రతేక కృతజ్ఞతలు తెలియజేశారు.



## గురుకుల విద్యాలయ సక్సెస్ మీట్ భాగంగా మన్ననూర్ పిటిజి ప్రిన్సిపాల్‌కు ఘన సన్మానం

**– ఇంటర్మీడియట్ లో 972 మార్కులు సాధించిన విద్యార్థికి మంత్రి, సెక్రటరీ చేతుల మీదుగా ప్రశంస పత్రం, రూ.10000 చెక్కు అందజేత...**






ఉమ్మడి మహబూబ్ నగర్ మే 30 (మనం బ్యూరో): హైదరాబాద్ బంజారాహిల్స్ లోని బాబు జగ్జీవన్ రావ్ భవన్ లో రాష్ట్ర గిరిజన గురుకుల విద్యాలయ సక్సెస్ మీట్ సందర్భంగా నల్లమల్ల విద్యార్థికి మంత్రి, గురుకులం సెక్రెటరీ అభినందిస్తూ పారితోషకం అందజేశారు. శనివారం హైదరాబాదులోని గురుకుల విద్యాలయ సక్సెస్ మీట్ లో భాగంగా 2026 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం మన్ననూరు గ్రామంలో టిటిజి హాస్టల్ లో చదువుతున్న నల్లమల్ల విద్యార్థి ఏనుపోతుల శివలింగం ఇంటర్మీడియట్ లో 1000 మార్కులకు గాను 972 మార్కులు సాధించడం పట్ల ఆ విద్యార్థిని రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, గురుకులం సెక్రటరీ సీత లక్ష్మిల చేతుల మీదుగా విద్యార్థికి ప్రశంస పత్రం అందజేసి, రూ.10000 చెక్కును అందజేశారు. విద్యార్థి ప్రతిభ కనపరచడం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ నిమ్మల పద్మావతిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, మహబూబ్ నగర్ రీజినల్ ఆర్ సి ఓ కళ్యాణి లతో పాటు తదితరులు పాల్గొన్నారు.